
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 3 జనవరి 2025 | 5







పట్టుకున్న సారా ప్యాకెట్లతో ఎమ్మెల్యే వాసు

సారా విక్రయించేవారిని.. నేనే పట్టుకోవాలా?

- సారా కేంద్రంపై ఎమ్మెల్యే దాడి
- ఎక్సయిజ్ సిబ్బందిపై ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) :నగరంలో సారా విక్రయాలు జరుగుతుంటే ఎక్సయిజ్ సిబ్బంది ఏం చేస్తున్నారని..సారా తాగేవారిని, విక్రయించే వారిని తానే పట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మండిపడ్డారు. రాజమహేంద్రవరం 46వ డివిజన్ పరిధి రామదాసుపేటలో గురువారం ఆయన పర్యటించారు. దీనిలో భాగంగా స్థానిక మహిళలు ఆయన దృష్టికి సారా విక్రయాలను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే సారా విక్రయిస్తున్న ప్రాంతానికి వెళ్లారు.అక్కడ సారా తాగుతున్న ఐదుగురు పారిపోతుండగా ఎమ్మెల్యే ప్రొటోకాల్ నిమిత్తం వచ్చిన పోలీసులు పట్టుకున్నారు.అక్కడ సారా విక్రయిస్తున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమహేంద్రవరం లో గంజాయి,సారా, బ్లేడు బ్యాచ్‌లను నిర్మూలించుకుంటూవెళుతుంటే యథేచ్ఛగా సారా అమ్మడానికి ఎంత ధైర్యం అని మండిపడ్డారు.రాజమహేంద్రవరంలో తాను మీ భద్రత మా బాధ్యత కార్యక్రమాలు 18 నిర్వహించానన్నారు. తనిఖీ చేసిన ప్రాంతంలో ఖాళీ సారా కవర్లు చూసి ఎమ్మెల్యే ఆశ్చర్యపోయారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

రేపటి నుంచి అమలు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 15 జూనియర్ కళాశాలల విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 5425 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారని తెలిపారు.ఈ పథకాన్ని ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. 12 కళాశాలలను సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులకు అనుసంధానం చేశామన్నారు.ఈ మేరకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సుబ్రహ్మణ్యం, డీఈవో కె.వాసుదేవరావులకు నిర్వహణపై పలు సూచనలు ఇచ్చామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి 7

రేపే 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ

శ్రీ షిర్డీ సాయి విద్యానికేతన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు

రాజమహేంద్రవరం,జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పండుగ వచ్చేసింది.. మహిళలకు ఆనందం తెచ్చేసింది.. ప్రతి ఏటా సంక్రాంతికి ముత్యాల ముగ్గుల పోటీ నిర్వహించడాన్ని ఆంధ్రజ్యోతి ఓ సంప్రదాయంగా కొనసాగిస్తోంది. ఈ ఏడాది కూడా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు ముస్తాబవుతోంది. రాజమహేంద్రవరం ఆల్ బ్యాంక్ కాలనీలో ఉన్న శ్రీ షిర్డీ సాయి విద్యానికేతన్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభిస్తారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఒక గంట ముందే ప్రాంగణానికి చేరుకోవాలి.విజేతలకు అదే రోజు బహుమతులు అందజేస్తారు. మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు,మూడో బహుమతి రూ.3 వేల నగదు అందజేస్తారు. మరో పది మందికి కన్సోలేషన్ బహుమతులు ఇస్తారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఏదో ఒక గిఫ్ట్ ఇవ్వనున్నారు. పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు, వగైరా సామగ్రి ఎవరికి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే పెట్టాలి. జడ్జిలు అడినప్పుడు ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు అని చెప్పగలగాలి. ముగ్గువేయడానికి గరిష్ట సమయం 2గంటలు ఉంటుంది. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో భవానీ చారి టబుల్ ట్రస్టు తరఫున ఏర్పాట్లు చేస్తున్నారు.



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఒకపక్క సంక్షేమం.. మరో పక్క అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గురువారం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చుతూ కేబినెట్‌లో అన్నదాత సుఖీభవ, మత్స్యకారులకు వేట నిషేధం పరిహారం పెంపు ఆదేశాలు జారీ చేసిందిగత వైసీపీ ప్రభుత్వం అరకొరగా ఇచ్చిన ఆర్థిక లబ్ధిని దాదాపు రెట్టింపుచేస్తూ నిర్ణయాలు తీసుకుంది.తద్వారా అన్నదాతలు, మత్స్యకారుల్లో ఆనందం నింపింది. అదే సమయంలో ఐదేళ్ల పాటు పెట్టుబడుల ఊసే లేకుండా అభివృద్ధిలో వెనుకబడిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను పారిశ్రామికంగా పరుగులు తీసేలా కీలక ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. గ్రీన్‌అమ్మోనియా, ఎలక్ట్రోలైజర్ ఉత్పత్తి యూనిట్ల ద్వారా ఏర్పాటు చేయనున్న కంపెనీలు పలు దశల్లో పెట్టనున్న రూ.16 వేల కోట్ల పెట్టుబడులకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. పిఠాపురం ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి 19 పోస్టులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

అన్నదాతా సుఖీభవ..

అన్నదాతలకు కేంద్రసాయంతో కలిపి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తున్నట్టు ప్రకటించింది. సూపర్‌సిక్స్ హామీ నేపథ్యంలో ఇచ్చిన మాట నెరవేరుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 4.54 లక్షల మంది అన్నదాతలకు రూ.908 కోట్ల వరకు లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది రైతులకు రూ.370 కోట్లు దక్కనుంది. తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.65 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు ఎకరాకు కేవలం రూ.13,500 వేలు మాత్రమే అందేది. మరో పక్క పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి 19 కొత్త పోస్టులను మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.



ఆనందం రెట్టింపు...

సుదీర్ఘ సముద్రతీరం ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలల్లో మత్స్యకారులు ఉన్నారు. వీరందరికి సముద్రంలో చేపలవేటే జీవనాధారం. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ మధ్య దాదాపు 61 రోజుల పాటు వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అసలు ఉపాధి ఉండదు. దీంతో ప్రభుత్వాలు వేట నిషేధ సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో మత్స్యకార భరోసా కింద వేట నిషేధ పరిహారం మత్స్యకారులకు రూ.10 వేలు చెల్లించేది. కూటమి ప్రభుత్వం రాగానే మత్స్యకారులకు అందించే పరిహారం పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేట నిషేధ పరిహారాన్ని ఏకంగా రూ.20 వేలు చేస్తున్నట్టు ప్రకటించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పరిహారాన్ని రెట్టింపు చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 32,434 మంది మత్స్యకారులకు రూ.64.86 కోట్ల లబ్ధి జరగనుంది. కాకినాడ జిల్లాలో 21,129 మంది, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 11,305 మంది మత్స్యకారులకు పరిహారం అందనుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమకానున్నాయి. దీంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి వరాల హారం.. ఆనంద తీరం

- రాష్ట్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు
- మత్స్యకారుల పరిహారం రెట్టింపు
- రూ.20 వేలకు పెంచుతూ నిర్ణయం
- 32,434 మందికి లబ్ధి
- అన్నదాత సుఖీభవ రూ.20 వేలు
- జిల్లాలో 4.54 లక్షల మంది రైతులు
- కాకినాడకు రెండు పరిశ్రమలు
- రూ.16 వేల కోట్ల పెట్టుబడులు

అమ్మోనియా హబ్‌గా కాకినాడ..

వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడకు ఒక్కటంటే ఒక్క పరిశ్రమా రాలేదు. పైగా ఉన్న పరిశ్రమలను బెదిరించి ఏకంగా రాయించేసుకున్నారు. దీనికి కాకినాడ సీపోర్ట్‌లో వాటాల మార్పే నిదర్శనం. అయితే వైసీపీ మిగిల్చిన విధ్వంసం నుంచి బయటపడి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పరిశ్రమలను ఆహ్వానిస్తూ కంపెనీలకు పెద్దపీట వేస్తోంది. కాకినాడలో ఏర్పాటవుతున్న గ్రీన్ అమ్మోనియా, ఎలక్ట్రోలైజర్ కంపెనీలకు భారీగా అండగా నిలబడి ప్రోత్సాహకాలు ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌కో కంపెనీ కాకినాడలో రూ.13 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. కంపెనీని పోత్సహించి భారీగా ఉద్యోగ, ఉపాధి కల్పన జరిగేలా కోట్లలో స్టాంప్ డ్యూటీ మినహాయింపునిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఒకరకంగా ఈ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభిస్తే కాకినాడ రూపురేఖలు మారడంతోపాటు రాష్ట్ర ఖజానాకు భారీగా పన్నుల ఆదాయం సమకూరనుంది. చలమలశెట్టి సునీల్ సోదరుడికి చెందిన గ్రీన్ కో కంపెనీ ఏఎం గ్రీన్‌గా ఏర్పడి 2023లో కాకినాడలో పేరొందిన నాగార్జున ఫెర్టిలైజర్ కర్మాగారాన్ని రూ.1,700 కోట్లకు స్టాక్ ఎక్స్ఛేంజీ ద్వారా కొనుగోలు చేసింది. ఇప్పుడు దీనినే సాంకేతికంగా అభివృద్ధి చేసి గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయబోతోంది. 2026 జూన్‌లోపు ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి ఒక మిలియన్ టన్ను సామర్థ్యంతో కూడిన గ్రీన్ అమ్మోనియాను కంపెనీ ఉత్పత్తి చేయనుందని అంచనా వేస్తున్నారు.

నీటి నుంచి ఆ రెండూ..

కాకినాడలో రూ.2,800 కోట్లతో ఎలక్ట్రోలైజర్ల తయారీ ప్లాంట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. హైడ్రోజన్ ఇంధనం తయారీలో కాకినాడ దేశంలోనే కీలకంగా మారనుంది. ఈ ప్లాంట్‌ను సైతం గ్రీన్‌కో కంపెనీ ఏర్పాటు చేయబోతోంది. ఈ ప్లాంట్ ద్వారా ఏటా 2 గిగా వాట్‌ల ఉత్పత్తి చేయనున్నారు. ఈ కంపెనీ నీటిలో ఎలక్ట్రోలైజర్ యంత్రాలను ప్రవేశపెట్టి నీటి నుంచి హైడ్రోజన్, ఆక్సిజన్‌ను వేరుచేస్తుంది. ఇందులో హైడ్రోజన్‌ను కాకినాడలో ఏర్పాటుచేయనున్న గ్రీన్ అమ్మోనియం ప్లాంట్‌కు ఇంధనంగా వినియోగించనుంది. హైడ్రోజన్‌లో నైట్రోజన్‌ను కలిపి గ్రీన్ అమ్మోనియం తయారుచేయనుంది. నీటి నుంచి వేరుచేసిన ఆక్సిజన్‌ను సైతం విక్రయించనుంది.





మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ధవళేశ్వరంలో కలెక్టరేట్?

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటి వరకూ 15 లక్షల మెట్రిక్ టన్నుల ఉచిత ఇసుక సరఫరా చేశాం. రాష్ట్ర అవసరాలకు ఇక్కడ నుంచి 65 శాతం అందించామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో గురువారం జేసీ ఎస్.చిన్నరాముడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు.ప్రస్తుతం కేటాయింపులు ముగియడంతో బోట్స్‌మన్ సొసైటీలన్నీ ఆగిపోయాయని తెలిపారు.ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని సెమీ మెకానిజం విధానంలో 52.82 లక్షల టన్నుల ఇసుకతీత లక్ష్యంగా నిర్ణయం తీసుకోనున్నామన్నారు. డ్రెడ్జింగ్ కాంట్రాక్టు ముగియడంతో మళ్లీ కొత్త ఏజెన్సీకి డ్రెడ్జింగ్ ఇచ్చే విషయమై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రహదారుల్లో గుంతలు పూడ్చే కార్యక్రమం కింద జిల్లాలో 531 కిలోమీటర్లు లక్ష్యంకాగా ఇప్పటి వరకూ 187 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చినట్టు చెప్పారు. ఉపాధి హామీ నిధులతో పల్లె పండుగ కింద సీసీ రోడ్లు, డ్రైన్లకు జిల్లాలో రూ.142 కోట్లు మంజూరు కాగా 50 శాతం పూర్తయ్యాయన్నారు. సం క్రాంతికి పూర్తి చేస్తామని చెప్పారు. రీ సర్వేలో భాగంగా 272 రెవెన్యూ గ్రామాలకు ఇప్పటి వరకూ 190 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన 72 గ్రామాల్లో మండలానికి ఒక గ్రామాన్ని తీసుకుని ముందుగా రీసర్వే చేస్తామన్నారు. జిల్లాలో 286 చోట్ల రెవెన్యూ సదస్సులు లక్ష్యంగా 230 గ్రామాల్లో నిర్వహించి 2903 అర్జీలు స్వీకరించామన్నారు. వాటిలో 1041 పరిష్కరించినట్టు చెప్పారు. పోలవరం -జీలుగుమిల్లి హైవే, పట్టిసీమ నుంచి కొవ్వూరు వరకూ ఏటిగట్టుపై జాతీయ రహదారికి సర్వే ఆరంభించినట్టు చెప్పారు.బొబ్బర్లంక నుంచి ధవళేశ్వరం ..వేమగిరి వరకూ గోదావరి బండ్ రహదారి నిర్మాణానికి ఎంపీ పురందేశ్వరి రూ.120 కోట్లతో ప్రతిపాదనలు చేసినట్టు తెలిపారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ఇళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. జాంపేట వద్ద పోలీసు గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ శాశ్వత భవన ప్రతిపాదన వెనక్కి తీసుకుని ధవళేశ్వరం ఇరిగేషన్ స్థలాల్లో నిర్మించే ఆలోచన చేస్తున్నామని.. వేరే ప్రాంతాల్లో భూమి పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

మేయర్‌గా పోటీ చేస్తా

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మేయర్‌గా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని.. ఈ సీటును వదులుకునే ప్రసక్తే లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అ న్నారు.మోరంపూడి గన్నిస్ శుభమస్తు ఫంక్షన్ హాలులో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆర్‌టీసీ విజయనగరం జోనల్ చైర్మన్‌గా పనిచేసిన నాటి నుంచి గుడా చైర్మన్ వరకు పార్టీకి నిస్వార్థంగా సేవలందించానని చెప్పారు. గతంలో తనను ఎంపీగా పోటీ చేయమని అధినేత చంద్రబాబే నేరుగా అడిగినప్పటికి పోటీ చేయకుండా ఆ అవకాశం చంద్రు శ్రీహరికి ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. మేయర్‌గా తన కుమార్తెను పోటీ చేయించమని అడిగినా వదులుకున్నామన్నారు. పార్టీ కోసం అహర్నిశలు పాటుపడ్డానని ఈ విషయం చంద్రబాబుకు తెలుసన్నారు. ఇప్పుడు ఒక్కసారైన ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నానని..తనను అందరు ఆదరిస్తారని చెప్పారు. పుష్కరాల ముందే ఎన్నికలు జరుగుతాయన్నారు. అది గ్రామాల విలీనంతోనా.. పాత 50 డివిజన్లతోనా అనేది తమ నాయకుడు చంద్రబాబు నిర్ణయమే ఫైనల్ అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేసి వేధించిన వారిని చంద్రబాబు పట్టించుకోకుండా వదిలివేయడం పట్ల పార్టీ శ్రేణుల్లో నిరాశ ఉందన్నారు. ఇక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కొంత మంది పోలీసులు తీరు మారలేదన్నారు. దీనిపై హోంమంత్రి స్పందించి సరిచేయాలన్నారు.

నేడు గోపాలపురంలో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గోపాలపురం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి సంస్థ అధికారి హరీష్‌చంద్ర ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పెరుమాళ్ల రావు తెలిపారు. మూడు ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయన్నారు.బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. జిల్లాలో నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.





ఆంధ్రజ్యోతి/సర్పవరం జంక్షన్

ఆ ఇల్లు..హరిత నందనవనం

మిద్దె తోటల సాగులో ఆదర్శం

ఆరేళ్లుగా ఆర్గానిక్ విధానంలో ఫలసాయం


650కి పైగా పూలు, పండ్ల మొక్కల పెంపకం

ఏరువాక, రైతునేస్తం అవార్డులు సాధించిన

కాకినాడకు చెందిన రాధ













ఆమె ఇల్లు ఓ హరిత నందనవనం. ఆ ఇంటికి వెళ్లగానే ఏజెన్సీ ప్రాంతానికి వెళ్తున్నామా అన్న అనుభూతి కలుగుతుంది. ఇల్లంతా గుబురుగా ఉండే పలు రకాల పచ్చని పండ్ల మొక్కలు, పువ్వులతో పరిమళాన్ని వెదజల్లుతూ ఎంతో ఆహ్లాదమైన వాతావరణం స్వాగతం పలుకుతుంది. మొక్కల పెంపకంపై ఉన్న ఆసక్తి మిద్దె తోటల సాగువైపు వెళ్లేలా కంకనాలపల్లి రాధను ప్రేరేపించింది. ఆరేళ్లుగా సంప్రదాయ సిద్ధంగా సేంద్రియ విధానంలో మిద్దె తోటల సాగు చేస్తూ ప్రతిష్టాత్మకమైన ఏరువాక, రైతు నేస్తం అవార్డులు సాధించి ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారు.

మిద్దె తోటలకు కేరాఫ్‌గా..

కాకినాడ రెండో డివిజన్ దుర్గా విద్యుత్‌నగర్‌కు చెందిన కంకనాలపల్లి మురళీగోపాలకృష్ణ, రాధలు భార్యాభర్తలు. భర్త ఇరిగేషన్‌శాఖలో ఈఈగా పనిచేసి 18ఏళ్ల కిందట పదవీ విరమణ చేశారు. వీరి తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం కావడంతో చిన్ననాటి నుంచి మొక్కల పెంపకాన్ని అలవాటుగా చేసుకున్నారు. ఇప్పుడు నేడు మొక్కలు లేనిదే జీవితం లేనంతగా వాటిపై ప్రేమను పెంచుకున్నారు. రెండు దశాబ్ధాలుగా కాకినాడలో సొంతింట్లో జీ ప్లస్ టూ భవన సముదాయాన్నే మిద్దె తోటల పెంపకం కేంద్రంగా చేసుకుని గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లపై 650కిపైగా పలు రకాల మొక్కలు, పండ్ల మొక్కలు, కాయగూరలు, ఆకుకూరలు, పూల మొక్కలను పెంచుతున్నారు. వీటిని కడియం, బెంగళూరు, హైదరాబాద్‌తోపాటు నర్సరీలు, ఆన్‌లైన్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు.









సేంద్రియ సాగుతో మేలు

సేంద్రియ విధానంలో మిద్దె తోటల సాగుతో కుటుంబ సభ్యులంతా ఆరోగ్యంగా జీవించవచ్చు. ఖాళీ స్థలం అవసరం లేదు. ఇంటి ఆవరణ, పై అంతస్తులో ఉన్న కొద్దిపాటి స్థలంలో వివిధ రకాలైన ఫల, పుష్పాలు, ఆకు, కాయగూరల సాగు చేపట్టవచ్చు. 50 ఏళ్లుగా భర్త సహకారంతో మొక్కలు పెంచడాన్ని అలవాటుగా చేసుకున్నా. ఇంట్లో సాగు చేసిన ఫలసాయాన్నే ఆహారంగా తీసుకుంటున్నాం.

-కంకనాలపల్లి రాధ, కాకినాడ



అవార్డులు..

మిద్దె తోటల పెంపకంపై ఆరేళ్లుగా రాధ సేంద్రీయ విధానంలో అనుసరిస్తున్న ఉత్తమ ఆచరణీయ పద్ధతులు, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. మిద్దె తోటల పెంపకంపై ఇతరులకు అవగాహన కల్పిస్తూ, చైతన్యం తీసుకొస్తున్నందుకు గాను 2023 ఏడాదికిగాను ఉత్తమ ప్రోత్సాహిక మిద్దె తోటల నిర్వాహకురాలిగా తెలంగాణా, ఏపీల నుంచి ఈమెకు విజయవాడ, హైదరాబాద్‌కు చెందిన ఏరువాక ఫౌండేషన్, రైతు నేస్తం అవార్డులు ప్రదానం చేశారు.

సేంద్రియ విధానంలో సాగు..



సంప్రదాయ పద్ధతిలో కేవలం ఇంట్లో వినియోగించే సహజసిద్ధమైన వనరులు, వ్యర్థాలను ఉపయోగించి సహజ ఎరువును కంకనాలపల్లి రాధ తయారు చేసుకుంటున్నారు. బయోచారు, వర్మీ కంపోస్టు, డీకంపోస్టు తదితర వాటిని ఇంటి పెరట్లోనే సేంద్రియ ఎరువు(మెన్యూర్) తయారు చేస్తున్నారు. సొంతంగా సేంద్రియ పద్ధతుల్లో తయారు చేసిన ఎరువునే మిద్దెతోటల్లో పెంపకంలో సాగుచేస్తున్నారు. పూల మొక్కల్లో గులాబీ, చామంతి, మల్లెపూలు, మందారం, సంపంగి, నందివర్ధనం తదితర రకాలు ఉన్నాయి. పండ్ల జాతుల్లో బత్తాయి, నారింజ, జామ, ద్రాక్ష, మల్బరీ, మామిడి కాయతోపాటు అరుదుగా లభిస్తున్న డ్రాగన్ ఫ్రూట్, స్వీట్, కివీ కాయ, ఖర్బూజ తదితరాలు ఉన్నాయి. ఆకుకూరల్లో తోటకూర, మెంతు కూర, పొన్నగంటి, పుదీన, కొత్తిమీర, చుక్కకూర, కాయకూరల్లో వంకాయ, బెండ, చిక్కుడు కాయ, మునగ, ఆనబకాయ, పసుపు, టమాటా, అల్లం తదితర కాయకూరలు సాగు చేస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపించే స్నేక్ ప్లాంట్, పీస్ లిల్లీ, జడ్ ప్లాంట్లు, మనీ ప్లాంటు, బోన్సాయ్ వంటివి కూడా పెంచుతున్నారు. మొక్కలు పెంచే కుండలకు వివిధ రకాల రంగులు వేసి పూల మొక్కల సాగు చేపట్టడంతో ఆకర్షణీయంగా మారింది.



వీసీ మురళీకృష్ణ నుంచి పుస్తకాలు అందుకుంటున్న విద్యార్థిని

ఫ్రాన్స్‌లోని ఓపెన్ లైబ్రరీ స్ఫూర్తిగా....

ఫ్రీబుల్ ద బుక్ బఫే

జేఎన్టీయూకేలో ప్రారంభించిన ఇన్‌చార్జి ఉప కులపతి మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఫ్రాన్స్‌లోని ఓపెన్ లైబ్రరీని స్ఫూర్తిగా తీసుకుని జేఎన్టీయూకేలో ఫ్రీబుల్ ద బుక్ బఫే కార్యక్రమం చేపట్టామని ఇన్‌చార్జి ఉప కులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్శిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 'ఫ్రీబుల్ ద బుక్ బఫే'ను వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఫేస్‌బుక్‌కి అలవాటుపడిన విద్యార్థులు పుస్తక పఠనాన్ని విస్మరిస్తున్నారన్నారు. దానిపై ఆసక్తి కలిగించేలా ఈ ఫ్రీబుక్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. క్యాంపస్‌లో మూడుచోట్ల దీనిని చేపడతామన్నారు. ప్రజలు, నగర ప్రముఖులు, అధ్యాపకులు అందజేసిన సాధారణ, సాంకేతిక పుస్తకాలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ రీడింగ్ రూమ్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. పుస్తకాలు లేని భవన సముదాయానికి చక్రవర్తిగా ఉండేకన్నా పుస్తకాలు ఉన్న పూరిగుడిసెకు కాపలాదారుగా ఉండడమే సంతోషమన్నదే తెలుగువాడి డీఎన్ఏ అని వీసీ పేర్కొన్నారు. ప్రతి రోజూ గ్రంథాలయంలో చదువుకోవచ్చన్నారు. ప్రతి శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తమకు నచ్చిన రెండు పుస్తకాలను విద్యార్థులు ఉచితంగా తీసుకుని మిగిలిన రోజుల్లో చదువుకునేందుకు తీసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, పలువురు డైరెక్టర్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



సామర్లకోట గూడ్స్‌యార్డ్‌లో దిగుమతి అవుతున్న బిహార్ ధాన్యం

సామర్లకోటకు బిహార్ ధాన్యం

2,400 మెట్రిక్ టన్నులు దిగుమతి

సామర్లకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు బిహార్ నుంచి రెండు గూడ్స్ రైళ్ల ద్వారా 2,400 మెట్రిక్ టన్నుల ధాన్యం గురువారం దిగుమతి అయ్యింది. ఇందుకు సామర్లకోట ఏడీబీ రోడ్డులోని ఒక భారీ రైస్‌మిల్లు రైల్వే శాఖకు రవాణా చార్జీగా రూ.90 లక్షలు చెల్లించింది. ఈ ఏడాది సామర్లకోట గూడ్స్ యార్డుకు బిహార్ నుంచి ధాన్యం దిగుమతి అవ్వడం ఇదే మొదటిసారి అని రైల్వే గూడ్స్ యార్డు అధికారులు తెలిపారు. తద్వారా సామర్లకోటకు చెందిన సుమారు 300 మంది హమాలీ జట్టు కూలీలకు, 200 లారీలకు ఉపాధి లభించింది.

రేపు 'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్

ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక

రామ్‌చరణ్, సినిమా టీమ్ హాజరు

లక్ష మంది వస్తారని అంచనా

వేమగిరి సమీపంలో భారీ ఏర్పాట్లు

రాజమహేంద్రవరం/కడియం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి సమీపంలోని జాతీయ రహదారి (గతంలో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహించిన) స్థలంలో ప్రముఖ నటుడు రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను శనివారం నిర్వహించనున్నారు. ఇందుకు గాను భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు లక్ష మంది అభిమానులు హాజరుకావొచ్చని చిరంజీవి అభిమాన సంఘం నాయకుల కథనం. శనివారం సాయంత్రం ఆరు నుంచి 9.30 గంటల వరకు ఈవెంట్ నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హాజరు కానున్నారు. ఆ రోజు సాయంత్రం మధురపూడి విమానాశ్రయానికి వచ్చి అక్కడి నుంచి కారులో షెల్టన్ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఈవెంట్ స్థలానికి వెళ్తారు. ఈ మేరకు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పోలీసు అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యే సభాస్థలిని పరిశీలించారు.



ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగే గ్రౌండ్ (పైన), ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్ (కింద)



ట్రాఫిక్ మళ్లింపు, భద్రత తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమానికి రామ్‌చరణ్‌తో పాటు నటులు కైరా అద్వానీ, అంజలి, ఎస్‌జే సూర్య, దర్శకుడు శంకర్, దిల్ రాజు, సంగీత దర్శకుడు తమన్ హాజరు కానున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన చిరంజీవి అభిమాన సంఘ నేతలు తాడితోటలో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఏపీ ప్రాంతాల నుంచి ఎంత మంది వస్తారో ఓ అంచనా వేశారు. ఈవెంట్‌ను సక్సెస్ చేయాలని అఖిల భారత చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు గెడ్డం శివ, రామ్‌చరణ్ అభిమాన యువశక్తి నేత శివ చెర్రీ, మెగా అభిమానుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలకు నలుగురి ఎంపిక

23న దుప్పలపూడిలో ప్రదానం

అనపర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏటా పలువురు ప్రముఖులకు అందజేసే స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలు -2025కు పలు రంగాల్లో నిష్ణాతులైన నలుగురిని ఎంపిక చేసినట్టు రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ గురువారం విలేకరులకు వెల్లడించారు. జీవన సాఫల్య పురస్కారాలను శాసనసభ పూర్వ ఉప సభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చిలుకూరి బాలాజీ దేవస్థానం ప్రధానార్చకుడు సీఎస్ రంగరాజన్, రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారు, బ్యారేజీల నిపుణుడు నాగినేని కన్నయ్యనాయుడులకు. స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డును ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, గౌడీయ సంప్రదాయకుడు రాధా మనోహరదాస్ ప్రభూజీలకు అందించనున్నట్టు వెల్లడించారు. ఈ నెల 23న అనపర్తి సమీపంలోని దుప్పలపూడి ఆర్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ అవార్డుతో పాటు జ్ఞాపిక, రూ.25వేల నగదు అందిస్తారని దుర్గాప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ పాల్గొంటారన్నారు.

యానాంలో 6 నుంచి ప్రజా ఉత్సవాలు

యానాం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శనల నిర్వహణపై పరిపాలనాధికారి మునిస్వామి గురువారం అధికారులతో సమీక్షించారు. ముఖ్య అతిథిగా హాజరైన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుదుచ్చేరి ముఖ్యమంత్రి, గవర్నర్, మంత్రులు, ఇతర ఉన్నతాధికారుల పర్యటనలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అక్కడి నుంచే సీఎం, ఇతర మంత్రులు, అధికారులతో మాట్లాడి వారి పర్యటనలను ఖరారు చేశారు. 6వ తేదీన ఉత్సవాలు ప్రారంభించనున్న సీఎం రంగసామి పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు. 8న ముగింపు ఉత్సవాలకు విచ్చేసే గవర్నర్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ అంశాలపై చర్చించారు. ప్రజా పనులు, మత్స్య, సాంఘిక, పౌరసరఫరాలు, పశువైద్య, వ్యవసాయ, మున్సిపాలిటీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు, మహిళలకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 23వ ఫల, పుష్ప ప్రదర్శన సందర్భంగా శ్రీటంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోటీలు నిర్వహించారు. సందేశాత్మకమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివసుబ్రమణియన్ ముగ్గులను పరిశీలించారు. ఉత్తమ ముగ్గులకు యానాం ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శన సభలో బహుమతులు అందజేయనున్నారు.



ప్రజా ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మల్లాడి కృష్ణారావు, అధికారులు





ముగ్గును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివసుబ్రమణియన్, పోటీలో ఆకట్టుకున్న ముగ్గు

భగీరథ యత్నం..!

- సాగు నీటి కోసం గోదావరి ఇసుక తిన్నెల్లో ఊట బావులు
- పది నుంచి 15 అడుగుల లోతు వరకు తవ్వకాలు
- మిర్చి పంటకు తడుల కోసం రైతుల తంటాలు



ఊట బావిలో ఇసుకను తోడుతున్న దృశ్యం



ఇసుక తిన్నెల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ మోటార్లు, ఊట బావి నీటిని పంట తడులకు వినియోగిస్తున్న దృశ్యం

ఎటపాక, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మిర్చి పంట సాగుచేసిన రైతులు నీటి తడుల కోసం భగీరథ యత్నాలు చేస్తున్నారు. పంటకు సాగునీటికి ప్రతి నీటిబొట్టును ఒడిసి పడుతున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో సాగు చేపట్టిన పంటకు సాగునీటికి రైతులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాంత రైతులు మిర్చి పంటను కాపాడుకు నేందుకు అదనపు ఖర్చుల భారంతో పడరాని పాట్లు పడుతున్నారు. గోదావరినది చెంతనే ఉన్నా రైతులకు సాగునీటి కష్టాల సమస్య తొల గడం లేదు. విలీన మండలాల్లో ప్రధానంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతాలతోపాటు లంక ప్రాం తాల్లో మిర్చిపంటను సాగుచేసిన రైతులు ఏటా సాగునీటికి ఇసుక తిన్నెల్లోని ఊట బావులపై ఆధారపడుతుంటారు. ఎటపాక మండలంలో ఈ ఏడాది 1,900 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గోదావరి వరదల భయంతో ఈ ఏడాది రైతులు అక్టోబరు నెల చివరి వరకు పంటను సాగు చేశారు. మొన్నటివరకు గోదావరి నదీ పాయలో నీరు ఉండేది. పాయలో నీరు ఇంకిపోవడంతో రైతులు ఊట బావిల వైపు చూస్తున్నారు. ఈక్రమంలో ప్రధానంగా గన్నవరం, గౌరిదేవిపేట, నందిగామ, మురుమూరు గోదా వరి పరివాహక ప్రాంత రైతులు ఊట బావిలను తవ్వుతున్నారు. గతంలో తవ్విన గుర్తులున్న (వరలు)ల్లోని ఇసుకను తొలగిస్తూ ఊట బావిలుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తు తం పది నుంచి 15 అడుగుల వరకు ఊట బా వులను తవ్వుతున్నారు. బావిలో ఊరే ఊట నీటిని తడులకు వినియోగిస్తున్నారు. ఊట తగ్గితే నీటి కోసం మరింత లోతు తీస్తున్నారు. తమకు అదనపు ఖర్చులు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటి నుంచి ఫిబ్రవరి చివరి వరకు మిర్చిపంట సాగునీటికి గోదావరిలో ఇసుకతిన్నె ఊట బావిలపైనే ఆధారపడుతుంటారు.

ఒక్కో ప్రాంతానికి.. ఒక్కో మెనూ



- సరికొత్తగా మధ్యాహ్న భోజన పథకం
- స్థానిక రుచులకు ప్రాధాన్యమిచ్చేలా మెనూ
- సంక్రాంతి తర్వాత అమలుకు చర్యలు

పెద్దాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూలో ప్రభుత్వం మార్పులు చేయనుంది. ఈ మార్పులను జోన్లవారీగా నిర్ధారించనున్నట్లు తెలుస్తోంది. ప్రాంతాల వారీగా విద్యార్థుల ఆహారపు అలవాట్లు ఆసక్తిగా తినే ఆహారం ఆధారంగా ఈ మెనూను రూపొందించింది. విద్యార్థులకు మంచి పోషకాలు అందేలా ఈ మెనూను రూపొందించారు. సంక్రాంతి సెలవుల తర్వాత పాఠశాలల్లో దీన్ని అమలులోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. వారంలో మంగళవారం మాత్రం రెండు రకాల మెనూలు ఇచ్చారు. విద్యార్థుల ఆసక్తి మేరకు ఏదో ఒకదాన్ని చేస్తారు.

ఒకటే మెనూ కావడంతో..

వైసీపీ హయాంలో మధ్యాహ్న భోజనం తినేందుకు విద్యార్థులు ఆసక్తిని చూపలేదు. ప్రస్తుతం అమలుచేస్తున్న మెనూ రాష్ట్రవ్యాప్తంగా ఒకటే కావడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులు అంత ఇష్టంగా భోజనం చేయడం లేదు. దీన్ని గమనించిన కూటమి ప్రభుత్వం మార్పులు చేయాలని నిర్ణయించింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు,విద్యారంగ నిపుణుల సూచనలు తీసుకుంది.

ప్రక్షాళన దిశగా..

కొత్తగా నిర్ణయించిన మెనూను సంక్రాంతి తర్వాత అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పెరుగుతున్న విద్యార్థులకు మంచి పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందించడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండడంతోపాటు ఉత్సాహంగా చదువుకునేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పథకం అమలుపై ప్రత్యేక దృష్టిసారించి దశలవారీ ప్రక్షాళన చేస్తున్నారు.

కొత్త మెనూ ఇలా..

సోమవారం: అన్నం, ఆకుకూరతో పప్పు, గుడ్డు ఫ్రై, చిక్కీ
మంగళవారం: పులిహోర, చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం: అన్నం, కూరగాయల కూర, గుడ్డు ఫ్రై, చిక్కీ
గురువారం: వెజ్‌రైస్/పలావ్, బంగాళ దుంప కుర్మా, ఉడికించిన గుడ్లు, రాగిజావ
శుక్రవారం: అన్నం, ఆకుకూరతో పప్పు, గుడ్డు ఫ్రై, చిక్కీ
శనివారం: అన్నం, కూరగాయల కూర, స్వీట్ పొంగల్, రాగిజావ

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

- మూడోరోజు 268మంది హాజరు

కాకినాడ క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మూడో రోజైన గురువారం 268మంది హాజరు కాగా 185మంది తదుపరి పరీక్షకు అర్హత సాధించారు. ఈ ప్రక్రియను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్వయంగా పర్యవేక్షించారు.



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తున్న యువకుడు

రైలునుంచి జారి పడి వ్యక్తి మృతి

తునిరూరల్,జనవరి 2(ఆంధ్రజ్యోతి): తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో కదులుతున్న రైలునుంచి జారి పడి వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తుని గుల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్య పాయకరావుపేట ఇందిరాకాలనీ సమీపాన రైలుపట్టాలపై రైలునుంచి జారి పడి 21ఏళ్ల వయసు గల యువకుడు మృతి చెందాడని, మృతుడి ఆచూకీ వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించామని తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్‌స్టేషన్ నెంబరు 9490619020ను సంప్రదించాలని కోరారు.

అర్ధరాత్రి డివైడర్‌ను ఢీకొని.. ఇద్దరు యువకుల మృతి

- ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు
- గండేపల్లి మండలం మురారిలో ఘటన

జగ్గంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో మురారి గ్రామ శివారున బుధవారం అర్ధరాత్రి బైక్ డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు అయ్యేవారు. తూర్పుగోదావరి జిల్లా మోరంపూడికి చెందిన లింగం నవీన్(21), సంతోష్(20) అన్నదమ్ముల బిడ్డలు. దీంతో వీరిద్దరూ కూడా అన్నదమ్ములవుతారు. వీరు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరంలో తన స్నేహితుడిని బుధవారం అర్ధరాత్రి ఇంటివద్ద దింపారు. తిరిగి ఇంటికి వస్తుండగా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారునకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. నవీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక ఎస్‌ఐ నాగబాబు సంఘటన స్థలానికి చేరుకుని సంతోష్‌ను రాజమహేంద్రవరం తరలించారు. ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నవీన్ మృతదేహాన్ని పెద్దాపురం పోస్టుమార్టానికి తరలించారు.



నవీన్, సంతోష్ (ఫైల్)



సంఘటనాస్థలంలో లింగం నవీన్, సంతోష్

మోరంపూడిలో విషాదం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం మురారి వద్ద డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో అన్నదమ్ములు లింగం నవీన్, లింగం సంతోష్ కుమార్‌ల మృతిచెందడంలో వీరి స్వస్థలం మోరంపూడిలో విషాదం అలుముకుంది. వీరిలో నవీన్ సూరంపాలెం ఆదిత్యలో బీటెక్ చదువుతున్నాడు. సంతోష్ తాపీ పని చేసుకుంటున్నాడు. నవీన్ తండ్రి గతంలో కరెంట్ షాక్‌తో మరణించడంతో అతడ్ని తల్లి వరలక్ష్మి కొడుకును ఇంజనీరింగ్ చదివిస్తోంది. కుమారుడి మృతితో ఆమె విలపిస్తోంది. లింగం సంతోష్ తండ్రి రత్నంరాజు కూడా తాపీపని చేస్తుంటాడు. పిల్లల మృతితో రెండు కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి.

సముద్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

- మూడుకు చేరిన మృతుల సంఖ్య
- కన్నీరుమున్నీరుగా విలపించిన నానమ్మ

సర్పవరం జంక్షన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట సముద్రంలో గల్లంతైన బొర్ర శ్రీనుబాబు(17) మృతదేహం గురువారం ఎన్టీఆర్ ఓల్డ్ బీచ్‌లో లభ్యమైంది. నూతన సంవత్సరం వేళ కొత్తపల్లి మండలం కోనపాపపేట శివారు మల్లివారితోటకు చెందిన గుత్తుర్తి సతీష్‌కుమార్(17), కాకినాడ రామకృష్ణారావుపేట ఎర్రరోడ్డుకు చెందిన వడిసెల గౌరీలక్ష్మీనాగసాయి(16) సముద్రంలో బుధవారం వేర్వేరుగా గల్లంతై మృతిచెందిన విషయం తెలిసిందే. వడిసెల గౌరీలక్ష్మీనాగసాయితో కలసి సముద్రస్నానానికి వెళ్లి బొర్ర శ్రీనుబాబు గల్లంతయ్యాడు. అతడి కోసం పోలీసులు మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం సూర్యారావుపేట సాగరతీరానికి శ్రీనుబాబు మృతదేహం కొట్టుకువచ్చినట్లు మత్స్యకారులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తిమ్మాపురం ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు మృతదేహాన్ని పరిశీలించి శ్రీనుబాబుగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆశలు ఆవిరి

కుమారుడు అనారోగ్యంతో మృతి చెందడం, తర్వాత కోడలు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనవడు బాగోగులు, సంరక్షణ బాధ్యత నానమ్మ బొర్ర దుర్గపై పడింది. వయసు మీద పడినా ఇళ్లల్లో పాచిపనులు చేస్తూ ఉన్నంతలో చదివిస్తోంది. కొత్త సంవత్సరంలో సరదాగా స్నేహితులతో బీచ్‌కు వెళ్లి వస్తానంటూ చెప్పి ఇంటి నుంచి వెళ్లిన మనవడు ఇలా అర్ధంతరంగా సముద్రంలో గల్లంతు కావడం, తర్వాత విగతజీవిగా మారడాన్ని చూసిన నానమ్మ దుర్గ కన్నీరుమున్నీరుగా విలపించింది. నానీ నానీ అంటూ ఎప్పుడు వెన్నంటి ఉంటే మనవడికోసం రోధించడం చూపరులకు బాధ కలిగించింది.





బీచ్‌లో మృతదేహం.. ఇన్‌సెట్‌లో శ్రీను(ఫైల్)

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

జగ్గంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గండేపల్లి హైవేపై గురువారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. రాజమండ్రివైపు నుంచి దేవరపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు మోటారుసైకిల్‌పై జగ్గంపేట వైపు వస్తున్నారు. వెనుకనుంచి వస్తున్న మోటారు సైకిల్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

పోర్టు ఎల్‌డీసీగా సుబ్రహ్మణ్యం

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో లేబర్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా ఎన్.సుబ్రహ్మణ్యాన్ని ప్రభుత్వం నియమించింది.ఆయన విజయనగరం లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై కాకినాడపోర్టుకు వస్తున్నారు.

నేడు దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

- కాకినాడలో జిల్లాస్థాయి పోటీలు

కాకినాడ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాలిపేటలోని పీఎస్‌రాజు మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాల్లో దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2025కు సంబంధించిన జిల్లాస్థాయి పోటీలను కాకినాడ డీఈవో పిల్లి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ తెలిపారు. బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నలాజికల్ మ్యూజియం వారి సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, భూమి అంతరిక్షశాస్త్రం, జీవ, పర్యావరణ, జీవరసాయన, కంప్యూటర్ శాస్త్రాలు వంటి ఉప అంశాల్లోను ఉపాధ్యాయుల, విద్యార్థుల వ్యక్తిగత ప్రదర్శన, విద్యార్థుల గ్రూప్ ప్రదర్శన వంటి విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాలోని ప్రతి మండలంనుంచి వ్యక్తిగత విభాగంలో 42, గ్రూప్ విభాగంనుంచి 42, ఉపాధ్యాయుల విభాగం నుంచి 42 మొత్తం 126 ప్రాజెక్టులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాయన్నారు. వివరాలకు 9912788333 నెంబర్లో సంప్రదించాలన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సైన్స్ అధికారి, డీఈవో

తాళ్లపొలంలో స్కూటీ దగ్ధం

- తనపై కొందరు దాడి చేశారంటూ ఏరియా ఆస్పత్రిలో చేరిన వ్యక్తి
- కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలో ఘటన

ద్రాక్షారామ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం తాళ్లపొలంలో గురువారం స్కూటీ దగ్ధమైంది. మండలంలోని తాడిపల్లి గ్రామానికి చెందిన పండు రమేష్ తనపై కొంతమంది దాడిచేశారని చెప్పి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేరాడు. తాళ్లపొలంలోని ఒక పొలంలో విత్తనాలు జల్లుతుండగా కొంతమంది తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించారని, తాను తప్పించుకున్నానని, దీంతో తన స్కూటర్‌పై పెట్రోల్ పోసి తగులపెట్టారని అన్నాడు. పోలీసులు పండు రమేష్ నుంచి వాంగ్మూలం తీసుకున్నట్లు సమాచారం. కానీ, ఇంకా దీనిపై కేసు నమోదు చేయలేదు.



దగ్ధమవుతున్న స్కూటీ

స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జోన్-2 పరిధిలో(ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో) ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు పోస్టులను ఒక ఏడాది కాలపరిమితితో కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ పద్మాశశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కల్గిన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 17 వరకూ సాయంత్రం ఐదు గంటల్లోగా రాజమహేంద్రవరంలోని వైద్య.ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు సీఎఫ్‌డబ్ల్యు.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. గతంలో నోటిఫికేషన్ నెం.5/2022, 1-12-2022న కానీ, 1/2023, 20-09-2023 తేదీన కానీ ఇది వరకే నియమితులై పనిచేస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అనర్హులని, వారి దరఖాస్తులు తిరస్కరిస్తామని అన్నారు.

రత్నగిరిపై డిజిటల్ చెల్లింపుల రెండో కౌంటర్ ప్రారంభం

అన్నవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు, వ్రతం టిక్కెట్లు, దర్శనం, ఇతర సేవల కోసం చేపట్టే నగదు చెల్లింపులతోపాటు డిజిటల్ పేమెంట్ల చెల్లింపునకు గురువారం పశ్చిమ రాజగోపురం వద్ద మరో కౌంటర్‌ను ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ప్రారంభించారు. సాధారణరోజుల్లో మధ్యాహ్నం 2గంటల వరకు పర్వదినాల్లో సాయంత్రం వరకు ఈ కౌంటర్ అందుబాటులో ఉండనుంది.



డిజిటల్ చెల్లింపుతో కొన్న టికెట్‌ను అందజేస్తున్న ఈవో, చైర్మన్

ప్రమాదవశాత్తూ కాలువలో జారిపడి వ్యక్తి మృతి

ఆత్రేయపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలువలో జారిపడి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన మేడిద శ్రీను(40) జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి వచ్చాడు. అతడి భార్య రోజా సింగపూర్‌లో ఉంటుంది. శ్రీనుకు ఇద్దరు సంతానం. వీళ్ల పిల్లలు ఆత్రేయపురం మండలం వద్దిపర్రులో వదిన వెంకటలక్ష్మి ఇంటి వద్ద ఉంటున్నారు. డిసెంబరు 31న శ్రీను పిల్లలను చూడడానికి వద్దిపర్రు వచ్చాడు. ఈ నెల 2న తెల్లవారుజామున 3గంటల సమయంలో పంటకాలువలో ప్రమావశాత్తూ జారి పడి మృతిచెందాడు. మృతుడి తమ్ముడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు మత్స్యకారులకు నష్టపరిహారం పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి2(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండలం కోరంగిలో ఓఎన్‌జీసీ సంస్థ విడుదల చేస్తున్న నష్టపరిహారాన్ని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు శుక్రవారం మత్స్యకారులకు అందజేయనున్నారు. తాళ్లరేవు మండలంలో మొత్తం 7050 మంది లబ్ధిదారులకు రూ.44కోట్ల 59లక్షలు పరిహారం పంపిణీ చేయనున్నారు. ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.63,250 చొప్పున అందజేస్తారు. ఈ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి కోరంగిలో ప్రారంభమవుతుంది. మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ఉదయం 11గంటలకు కోరంగి చేరుకుంటారు. మధ్యాహ్నం తాళ్లరేవులో మధ్యాహ్న భోజనం స్వీకరిస్తారు. అక్కడినుంచి మధ్యాహ్నం 3గంటలకు సామర్లకోట చేరుకుని రాష్ట్ర గిడ్డంగి గోదాములను ప్రారంభిస్తారు. రాత్రి 8గంటలకు మంత్రి విజయవాడ చేరుకుంటారు.

గొల్లప్రోలులో డంపింగ్‌యార్డు కాంపౌండ్ వాల్ నిర్మాణంపై వివాదం

- నిర్మాణాలు తొలగించిన స్థానికులు



డంపింగ్‌యార్డు స్థలం వద్దకు వచ్చిన అధికారులను చుట్టుముట్టిన స్థానికులు

గొల్లప్రోలు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చెత్తను వేసే డంపింగ్‌యార్డును తరలించమంటే కాంపౌండ్‌వాల్ నిర్మించడంపై గొల్లప్రోలులో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు అడ్డుకోవడంతోపాటు ఇప్పటికే నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను తొలగించారు. గొల్లప్రోలు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీ చెంతనే డంపింగ్‌యార్డు ఉంది. గొల్లప్రోలు పరిధిలోని చెత్తాచెదారాన్ని తెచ్చి ఇక్కడే వేస్తుండడంతో పరిసరాలు దుర్గంధపూరితంగా మారాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లలేకపోతున్నామని కొంతకాలంగా ఎస్సీ కాలనీ, అరుంధతీయపేటవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్‌యార్డును ఇక్కడినుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు డంపింగ్‌యార్డు వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని ఒకపక్కగా తరలించడంతో కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ సీఎస్ఆర్ నిధులనుంచి రూ.7లక్షలు మంజూరు చేశారు. దీంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనిపై ఎస్సీ కాలనీ, అరుంధతీయపేటవాసులనుంచి అభ్యంతరం వ్యక్తమైంది. కాంపౌండ్‌వాల్ నిర్మించి చెత్త ఇక్కడే వేస్తే తాము పరిసర ప్రాంతాల్లో ఉండలేమని, పనులు నిలిపివేయాలని వారు అధికారులు, ప్రజాప్రతినిధుల ను కోరారు. తమ డిమాండ్‌కు స్పందన లేకపోవడంతో వారు ఆగ్రహించి ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కాంపౌండ్‌వాల్ వద్దకు గురువారం సాయంత్రం చేరుకుని పనులు అడ్డుకున్నారు. కాంపౌండ్‌వాల్‌ను, అందుకు ఉపయోగించిన ఇతర కట్టడాలను, ఫెన్సింగ్‌ను తొలగించారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని సముదాయించేందుకు ప్రయత్నించినా శాంతించలేదు. పోలీసులు అక్కడ ఉండగానే మరోవైపు నిర్మాణాలు తొలగించారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ట్రైనీ కలెక్టర్ భావన, తహసీల్దార్ సత్యనారాయణ, ఎం పీడీవో స్వప్న, ఇన్‌చార్జి కమిషనరు ప్రభాకర్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ అక్కడకు చేరుకున్నారు. వారిని ఆందోళనకారులు చుట్టుముట్టారు. వారితో అధికారులు చర్చలు నిర్వహించారు. డంపింగ్ యార్డు పరిసరాలు 2.60 ఎకరాలు ఉందని, ఇందులో 1.50 ఎకరాలను ఎస్సీకాలనీ, అరుంధతీయపేట శ్మశానవాటికలకు కేటాయిస్తామని ఆర్డీవో తెలిపారు. ఆరునెలల్లోగా డంపింగ్ యార్డు స్థల సేకరణ పూర్తి చేసి అక్కడకు తరలిస్తామని చెప్పా రు. వీటిపై తమ నిర్ణయాన్ని తెలియజేయాలని ఆర్డీవో వారికి సూచించగా శుక్రవారం బదులి స్తామని నాయకులు తెలిపారు.

అధిక ధర ఇస్తానని మోసాలు

- కొవ్వూరుకు చెందిన వ్యక్తి అరెస్టు

చాగల్లు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అధిక ధర ఇస్తామని నమ్మించి ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా మోసగించిన కొవ్వూరుకు చెందిన దుద్దుపూడి సూరిబాబును పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ కె.నరేంద్ర వివరాల ప్రకారం.. తూర్పుగోదావరిజిల్లా చాగల్లు మండలంలోని దారవరం గ్రామానికి చెందిన గారపాటి సత్తిబాబు నుంచి సూరిబాబు నాలుగు లారీ లోడుల ధాన్యాన్ని తీసుకువెళ్లి డబ్బులు ఇవ్వకుండా మోసగించి పరారీలో ఉన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సూరిబాబును గురువారం అరెస్టు చేసి నిడదవోలు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. అతడిపై కొవ్వూరురూరల్, టౌన్ స్టేషన్లు, సీతానగరం, గోకవరం, జంగారెడ్డిగూడెం, ఐ.పోలవరం, ఒడిశా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆస్తి తగాదాల నేపథ్యంలో పినతండ్రిపై కత్తితో దాడి

- తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో ఘటన

కొవ్వూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాల నేపథ్యంలో పినతండ్రిపై కత్తితో దాడిచేసిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో చోటుచేసుకుంది. కొవ్వూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన గన్నమని లక్ష్మణరావుకు, అతడి అన్నయ్య వెంకట రామారావుకు కొంతకాలంగా భూతగాదాలు ఉన్నాయి. గన్నమణి వెంకటరామారావు, అతడి కుమారుడు సతీష్‌చౌదరి లక్ష్మణరావు నడిచే స్థలాన్ని మూసివేశారు. వ్యవసాయ మోటారు పైపులు, వైర్లను కట్‌చేశారు. దీనిపై లక్ష్మణరావు ప్రశ్నించడంతో భూమి సరిహద్దు విషయమై వివాదానికి దిగారు. లక్ష్మణరావు గురువారం పంట పొలం దున్నుతుండగా సతీష్‌చౌదరి అక్కడికి వెళ్లి తండ్రి వెంకటరామారావు సహకారంతో కొడవలితో దాడిచేశాడు. అడ్డువచ్చిన లక్ష్మణరావు భార్య కృష్ణవేణి చెయ్యిపై దాడిచేయడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. వారిని రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణరావు ఫిర్యాదుపై తండ్రి, కొడుకులపై కేసునమోదు చేశారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రోగులకు అందుబాటులో లేకపోతే ఎలా?

● అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆగ్రహం

● ప్రక్షాళన చేయాలని జిల్లా వైద్య శాఖాధికారికి ఫోన్


ఆసుపత్రి సిబ్బందిని నిలదీస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రక్షాళన చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం బృహన్నలపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన ఆయన వెంటనే ఆసుపత్రికి వెళ్లి ముందుగా హాజరుపట్టి పరిశీలించారు. ఆసుపత్రిలో ఐదుగురు సిబ్బంది ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉండడంపై మిగిలిన వారు ఎక్కడని ప్రశ్నించారు. ఏవో పొంతనలేని సమాధానాలు చెప్పడంతో మండిపడ్డారు. 20 రోజులుగా సంతకాలు లేకపోవడం చూసి విస్తుపోయారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గడువు దాటిన మందులను ఆసుపత్రిలో తగులపెట్టిన మహిళపై మండిపడ్డారు. తీరు మార్చుకోకపోతే ఇక ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. డీఎంహెచ్‌వోకు ఎమ్మెల్యే ఫోన్ చేసి హెల్త్ సెంటర్ పరిస్థితిని వివరించారు. తరచూ పర్యటించి పరిశీలించకపోతే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందవని అన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, నాయకులు ఉన్నారు.

2025లో కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచుదాం

●పెట్రోల్ బంక్ పెట్టాం.. త్వరలో సోలార్ పవర్, గ్రీన్ బాండ్లు ●కమిషనర్ కేతన్ గార్గ్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం 2025లో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆదాయాన్ని మరింతగా పెంచే విధంగా నిర్ణయాలు, నూతన ప్రాజెక్టులతో ముందుకు సాగుతామని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పుష్కరాలకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రహదారుల విస్తరణ, కొత్త ఘాట్లు, డ్రైనేజీలు చేపడుతున్నట్టు తెలిపారు.రాజమహేంద్రవరంలో రూ.75 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. కార్పొరేషన్‌కు ఆదాయం పెంచే చర్యల్లో భాగంగానే క్వారీ సెంటర్‌లో పెట్రోల్ బంకు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో రూ.45 కోట్లతో సోలార్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. కాకినాడ-రాజమహేంద్రవరం మధ్యలో వేస్టేజ్ రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. అతి త్వరలో రాజమహేంద్రవరంలో గ్రీన్ బాండ్లను అందుబాటులోకి తెస్తామన్నారు. నగరంలో పన్నులకు సంబంధించి టార్గెట్ రూ.70 కోట్లకు ఇప్పటి వరకు రూ.58 కోట్లు వసూలు చేశామని.. మిగిలింది రెండు నెలల్లో వసూలు చేస్తామన్నారు. నగరంలో అక్రమ కట్టడాలపై దృష్టి పెట్టామని వాటిపై చర్యలు తీసుకోబోతున్నామని చెప్పారు. రాజమహేంద్రవరాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సింగిల్ డిజిట్ ర్యాంక్ సాధించే విధంగా మెరుగుపరుస్తున్నామని ప్రజలంతా దీనికి సహకరించాలని కమిషనర్ కోరారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ వెంకటరమణ, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ కోటయ్య, హెల్త్ఆఫీసర్ డాక్టర్ వినూత్న, మేనేజరు మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ 9వ మండల అధ్యక్షురాలిగా నాగదేవి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గురువారం రాజమహేంద్రవరం 9వ మండల బీజేపీ అధ్యక్షురాలిగా యర్రా వెంకట నాగదేవి ఎన్నికయ్యారు. అలాగే 1వ మండల అధ్యక్షురాలిగా తుమ్మగుంట రమణమ్మను సభ్యులు ఎన్నుకున్నారు.మండల రిటర్నింగ్ అధికారిగా తనుబుద్ధి భాస్కర్ వ్యవహరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, నిల్లా ప్రసాద్, పెమ్మడి వీర్రాజు, పాలవలస బాబ్జి, ఉమా నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కవలగొయ్యి గ్రామంలో, ఎలైట్ కరాటే క్లబ్ నిర్వహించిన కరాటే పోటీల్లో విజేతలకు హుకుంపేటకు చెందిన తెల్లమేకల సూర్యకృష్ణ సర్టిఫికెట్లు, బెల్టులను అందజేశారు. అనంతరం కోచ్ పంచకట్ల శ్రీనివాసులును అభినందించారు. ఈ నెల 5న భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొనే పంచికట్ల చిన్నాను అభినందించారు.

వారానికి మూడు రోజులేనా!

» చెత్త తరలింపుపై రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పనితీరు

» వాహనాలు రాకపోవడంతో ఇళ్ల దగ్గరే చెత్త, ఇతర వ్యర్థాలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు చెందిన చెత్త తరలింపు వాహనాలు సక్రమంగా రాకపోవడంతో ఇళ్లల్లో చెత్త పేరుకుపోతోంది. క్వారీ మార్కెట్ ఏరియాలోని అనేక వార్డుల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఇళ్ల వద్ద నుంచి చెత్త తీసుకెళ్లే వాహనాలు వారానికి మూడు, నాలుగు రోజులు మాత్రమే వస్తుండడంతో రోజువారీ చెత్త, ఇతర వ్యర్థాలు ఎక్కడ ఉంచాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ ప్రాంత గృహిణిలు వాపోతున్నారు. పారిశుధ్య సిబ్బందికి ఆదివారం సెలవు కావడంతో ఆ రోజు చెత్త తరలింపు జరగడంలేదు. పీఅండ్‌టీ కాలనీ, సిద్ధార్థనగర్, సుబ్బారావు నగర్, సింహాచలనగర్ వంటి కొన్ని ప్రాంతాల్లో అయితే శని, సోమవారాల్లోనూ వాహనాలు రావడంలేదు. మిగిలిన రోజుల్లో వాహనం వస్తే వచ్చినట్టు లేకపోతే లేదు. ఒక వేళ వాహనం వచ్చినా ఎప్పుడు వస్తుందో తెలీదు. దీనిపై ఆయా ప్రాంతాల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క రోజు చెత్త తీసుకెళ్లే వాహనం రాకపోతేనే ఇబ్బందికరంగా ఉంటుందని, అలాంటిది మూడు, నాలుగు రోజులు వాహనం రాకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. చెత్త తీసుకెళ్లే వాహనం రాకపోవడంతో కొంతమంది ఆహార వ్యర్థాలు, కూరగాయల తొక్కలు, మిగిలిపోయిన అన్నం, ఇతర చెత్తనంతా డ్రైనేజీల్లో పడేస్తున్నారు. వీధులు తుడవడానికి అప్పుడప్పుడూ వచ్చే కార్మికులను అడిగితే వాహనం సంగతి తమకేమీ తెలియదని చెబుతున్నారని అంటున్నారు. నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించాలని క్వారీమార్కెట్ ఏరియాలోని ప్రజలు కోరుతున్నారు.


చెత్త తరలింపు వాహనం రాకపోవడంతో ఒక ఇంటి వద్ద పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఉన్నత విద్యకు గుదిబండగా మారిన జీవో 77 రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ డిమాండ్ చేశారు. ముఖ్య కార్యకర్తల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం జూనియర్ కళాశాలల నిధులను దారి మళ్లించిందన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి వెంటనే నిధులను మంజూరు చేసి వసతులు మెరుగుపర్చాలన్నారు. పీజీ, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా రూ.3,580 కోట్లు ఫీజు బకాయిలు ఉన్నాయని, ఈ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.భవిత, కె.ఉష, టి.అరుణ, కె.కవిత, ఎం.తేజశ్విని, బి.ప్రశాంత్, వరుణ్‌తేజ్ పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి

గోకవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 5న జరగబోయే హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సీఎండీ లేఅవుట్ ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేసంలో ఆయన మాట్లాడుతూ దేవాలయాల ఆస్తులను రక్షించడం, భక్తుల మనోభావాలకు అనుగుణంగా దేవాలయాల వద్ద చర్యలు చేపట్టడం వంటి అంశాలు తెలియజేసేలా ఈసభ కొనసాగుతుందన్నారు. సుమారు 5లక్షల మందితో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ వచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కడియం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి, మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి తెలిపారు. గ్రామ పరిధిలో చైతన్యనగర్‌లో పేపరుమిల్లు సహకారంతో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు చంటిని సత్కరించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు బొల్ల ధనుంజయ రాజు, కంది లింగరాజు, కోఆప్షన్ మెంబర్ డాక్టర్ శ్రీను, కొల్లిమల్ల రమణ పాల్గొన్నారు.

గ్రామీణ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

» జిల్లా ఆత్మ పీడీ జ్యోతిర్మయి

» కేవీకేలో గొర్రెలు, మేకల పెంపకంపై గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న కేవీకే హెడ్ నాయుడు

రాజానగరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి ఆకాంక్షించారు. రాజానగరం మండలం కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రంలో ఆత్మ సౌజన్యంతో యువతకు శాస్త్రీయ పద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకంపై వారంలో రోజుల పాటు నిర్వహించే నైపుణ్య శిక్షణా తరగతులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో గొర్రెలు, మేకల పరిశ్రమలను స్థాపించి, ఇందుకు అవసరమయ్యే మూలధనాన్ని బ్యాంకుల నుంచి రుణం పొందే విషయంలో ఆత్మ సహకరిస్తుందన్నారు. మరో ముఖ్యఅతిథి, కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకాన్ని స్థాపించాలనుకునే వారు ముందుగా పెంపకంలో ఎదురయ్యే లాభనష్టాల గురించి తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. పశువుల్లో వివిధ రోగాలను నివారించే చర్యలపై అవగాహన ఉండాలన్నారు. పశుపోషణ అధికారి డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకం పరిధి, ప్రాముఖ్యతను వివరించారు. గొర్రెలు, మేకలతో ఉన్న ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే ఉద్యానశాఖాధికారి జేవీఆర్ సత్యవాణి, సబ్జెక్టు మేటర్ స్పెషలిస్ట్ రవీంద్ర సొంటెక్కె, సంజయ్ హెగ్డే,టి.విజయ వర్ధన్, ఆర్.రత్నాజీ,గొల్లప్రోలు, రాజానగరం, ప్రత్తిపాడు, తొండంగి, రాజమహేంద్రవరం రూరల్,అర్బన్ మండలాలకు చెందిన 15 మంది ఔత్సాహిక యువకులు పాల్గొన్నారు.

పేపర్‌మిల్లు సమస్యలపై నేడు సీఎంతో భేటీ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని పేపర్ మిల్లు కార్మికుల వేతన సవరణ, ఇతర సమస్యలపై మాట్లాడేందుకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భేటీ కానున్నారు. ఈమేరకు ఎంపీ పురందేశ్వరి సీఎం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. గత డిసెంబరు 24న కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్మికశాఖ జాయింట్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన ప్రజాప్రతినిధుల సమక్షంలో పేపర్‌మిల్లు యాజమాన్యం, కార్మికులతో కలసి వేతన సవరణ విషయంపై సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో వేతన సవరణ విషయం పరిష్కారం కాకపోవడంతో, ఈ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్తామని ఎంపీ పురందేశ్వరి ప్రకటించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సీఎంతో భేటీ కానున్నారని ఎంపీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

48గంటల్లో పరిహారం అందాలి

» అట్రాసిటీ చట్టంతో అట్టడుగు వర్గాలపై వివక్ష, దౌర్జన్యాలు తొలగిపోవాలి: కలెక్టర్ ప్రశాంతి

» పౌరహక్కులపై ప్రతినెలా సమావేశం నిర్వహించాలి: ఎస్పీ కిషోర్

» జిల్లా స్థాయి మోనటరింగ్ కమిటీ త్రైమాసిక సమావేశం


జిల్లా మోనటరింగ్ కమిటీ త్రైమాసిక సమావేశ దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత ఉత్తర్వులు జారీ చేసిన వాటికి 48గంటల్లో పరిహారం అందజేయాల్సి ఉంటుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఎస్సీఎస్టీ అత్యాచారాల నిరోధకచట్టం 4వ త్రైమాసిక జిల్లా స్థాయి మోనటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎంఎస్ శోభారాణి, కమిటీ సభ్యులు తాటికొండ బాబు, ఆరుగొలను చిన్నరాజు, రాచర్ల జాన్, పలు శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరహక్కుల పరిరక్షణ చట్టం, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అత్యాచారం నిరోధక చట్టం, అట్టడుగు వర్గాలపై వివక్ష, దౌర్జన్యాలను తొలగించే లక్ష్యంతో పర్యవేక్షణ, చట్టాలు అమలు ఉండాలన్నారు. 2016 వెలుగులో సవరించిన నిబంధనలను రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆ మేరకు త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీని ప్రకారం అట్రాసిటీ బాధితులకు ఉపశమనం మొత్తం రూ.85,000 మేరకు పరిహారం అందజేయాలన్నారు. ఎస్పీ నరసింహకిషోర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, పరిష్కారం కోసం ఖచ్చితంగా ప్రతినెల చివరి శనివారం మండల స్థాయి కమిటీ పౌరహక్కులపై సమావేశం నిర్వహించాలన్నారు. వాటికి సంబంధించి ముందస్తుగా తహశీల్దార్ షెడ్యూల్ నిర్ణయించి వాటిని స్టేషను హౌస్ అధికారికి అందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమగ్ర వివరాలు రూపొందించుకోవాలన్నారు. గత ఐదారు నెలలు కాలంలో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు తగ్గాయని వివరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణిసుస్మిత, డీఎస్పీలు, ఇన్‌చార్జి డీపీవో ఎం.నాగలత, ఐసీడీఎస్ అధికారి కె.విజయకుమారి, సంక్షేమ శాఖ అధికారులు కేఎస్ జ్యోతి, బి.శశాంక, వై.శ్రీనివాస్, ఎన్‌వీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతుల పూజలు

బిక్కవోలు జనవరి 2(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు బుధవారం రాత్రి బిక్కవోలు లక్ష్మీగణపతిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన కొత్తపేట రామాలయం వద్ద నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేకు కట్ చేశారు. రాతి చెరువుపేటలోని జీడీఎం ప్రార్థనా మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన కేకు కట్ చేసి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట కూటమి నేతలు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, ఏసు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


బిక్కవోలులో లక్ష్మీగణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు

ఎడ్జ్‌తో కేంద్రీయ విద్యాశాఖ ఏజీసీటీతో ఒప్పందం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ఎడ్జ్ వన్ అనే విద్యారంగ-పరిశోధనకు చెందిన అంకుర సంస్థకు కేంద్రీయ విద్యాశాఖకు అనుసంధానంగా ఉన్న ఏజీసీటీతో ఒప్పందం జరిగింది. ఈ మేరకు ఢిల్లీలో గురువారం ఇరుపక్షాల మధ్య ఒప్పందం జరిగినట్టు సంస్థ చైర్మన్ రాంకుమార్ రామదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పుడు జరిగిన ఒప్పందం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు తమ జీరో సైన్స్ డిజిటల్ ప్రయోగశాల ద్వారా ప్రతీ పాఠ్యాంశాన్ని తరగతి గదిలోనే ప్రయోగాలతో బోధించే విధంగా ప్రోత్సాహం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో బ్రహ్మాజీరావు, రీసెర్చ్ డైరెక్టర్ హరనాథ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో గర్భిణులకు సామూహిక సీమంతాలు

రంగంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గర్భవతులు పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు తీసుకోవాలని రంగంపేట ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీప్లోరెన్స్ అన్నారు. గురువారం మండలంలోని ఈలకొలనులో అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భిణులకు సామూహిక సీమంతాలు కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యతిథిగా విచ్చేసిన సీడీపీవో మాట్లాడుతూ ఆకు కూరలు, బాల సంజీవని కిట్‌లో ఉన్న రాగి పిండి బెల్లం కర్జూరం, అటుకులు, వేరుశెనగ అచ్చు తప్పని సరిగా తినాలని, గుడ్లు,పాలు తీసుకోవాలని, బాల్య వివాహాలు చేయకూడదని, నిమ్మ, నారింజ, సి విటమిన్, ఉండేవి, మునగ కూర తినాలన్నారు. అనంతరం గర్భిణులకు సామంతాలు నిర్వహించారు. కార్యక్రమం లో సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్‌కే గుల్జార్‌బేగం, ఏఎస్ఎం జలజాక్షి, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు చింతపల్లి సూర్యకుమారి, లోవకుమారి, వెంకయ్యమ్మ, మంగమ్మ, వీరవేణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ ఏఈ దాట్ల శ్రీధర్‌వర్మ చెప్పారు. ముకుందవరం గ్రామానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. రంగంపేట సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11 కెవి నాయకంపల్లి ఫీడర్‌కు విద్యుత్ సరఫరా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ నిలిపి వేస్తామన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు దుప్పట్లు పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జియోన్ అంధుల పాఠశాలలో గురువారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోట సుబ్బారావు ఆధ్వర్యంలో 60 మంది విభిన్న ప్రతిభావంతులకు దుప్పట్లు, దిండ్లు పంపిణీ చేశారు. దీనికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత హాజరయ్యారు. విభిన్న ప్రతిభావంతులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం క్లబ్ ఆధ్వ రంలో ప్రియదర్శిని ఆశ్రమాన్ని సందర్శించారు. దుప్పట్లు, తలదిండ్లు అందించారు.

దుర్గాప్రసాద్‌కు రిమాండ్

సీతానగరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాజంపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో కాటవరానికి చెందిన నిందితుడు గాడ దుర్గాప్రసాద్‌కు కోర్టు రిమాండ్ విధించిందని కోరుకొండ సీఐ సత్యకిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని, రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించామన్నారు. నిందితుడిపై త్వరలో రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.రామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

పాఠశాల విద్యాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

రంగంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాభివృద్ధిలో ఛైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని రంగంపేట మండల విద్యాశాఖాధికారి -1 కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యాశాఖ అధికారి - 2 పి.మధుసూధనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లు, ప్రధానోపాధ్యాయుల ఒకరోజు శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 17 గ్రామాల నుంచి 48 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాకమిటీ ఛైర్మన్లు, సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలు


స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

బిక్కవోలు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న స్వామి వారి ద్వితీయ బ్రహ్మోత్సవాలు గురువారం ముగిసాయి. ఉదయం సుప్రభాతసేవ, తోమాల సేవతో కార్యక్రమాలు ప్రారంభించారు. ఉదయం 108 మంది ముత్తయిదువులు బిందెలతో గోదావరి జలాలను స్వామి వారి అభిషేకానికి తీసుకురాగా అర్చకులు అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామి వారి పుష్కరిణిలో శ్రీచక్రస్నానం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో గోదాదేవి కల్యాణం జరిపారు. సాయంత్రం స్వామివారిని త్రివిక్రమ స్వామి అవతారం రథంపై వుంచి వీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామి పుష్కరిణిలో హంస వాహనంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి తెప్పోత్సవాన్ని ఘనంగా జరిపారు. భక్తులకు చైర్మన్ మల్లిడి గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అన్న ప్రసాదాన్ని అందించారు.

కూర్మావతారంలో భజేనారాయణుడు


కూర్మావతారం, జగన్మోహిని అవతారంలో కొలువుదీరిన భజేనారాయణుడు

రంగంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో నున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీభజేనారాయణస్వామి ఆలయంలో దశావతార ఉత్సవాలలో భాగంగా కూర్మావతారం, జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీభజేన్నారాయణస్వామి ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు చిలకమర్తి మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు శిక్షణ

సీతానగరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సీతానగరం ప్రభుత్వోన్నత పాఠశాలలో గురువారం మండలంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో ఎస్ఎంసి శిక్షణ నిర్వహించారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎంఈఓ స్వామినాయక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కెఎల్ మనోహర్, డి.సత్యనారాయణ, ఎ.ప్రసాద్ అవగాహన కల్పించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

బిక్కవోలు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు రైతులకు సూచించారు. కొంకుదురులో గురువారం సర్పంచ్ సత్తి వీరమణి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ భూముల కొలతల్లో తేడాలుంటే రీసర్వేలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని మూడు దేవస్థానాలకు సంబంధించిన భూముల వ్యత్యాసం సరిచేసి పాస్‌బుక్‌లు ఇవ్వాలంటూ ఏఎంఈఓ ఎస్ఎస్‌వి ప్రసాద్ దరఖాస్తు అందజేశారు. సదస్సులో 11 దరఖాస్తులు అందాయని తహశీల్దార్ సత్యకృష్ణ తెలిపారు. సదస్సులో ఎంపీటీసీ వీవీ, పంచాయితీ కార్యదర్శి కె.సత్యనారాయణరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీలు అందించిన రైతులు

గోకవరం: రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని ఠాకూరుపాలెంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా రైతులు వివిధ సమస్యలపై మూడు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు సాయి ప్రసాద్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వార్డుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. నియోజకవర్గం పరిధిలోని 28వ వార్డు భారత బొమ్మల సమీపంలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం వార్డుల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మురుగు బయటకుపోయే డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడాలని, ఇళ్ల ముందు డ్రైనేజీలపై సిమ్మెంటు బల్లలు ఏర్పాటు చేసుకోవడంతో మురుగు శుభ్రం చేసేందుకు వీలు లేకపోవడం వల్ల డ్రైన్లు పూడుకుపోతున్నాయని వీటిని శుభ్రం చేస్తే మురుగు నిల్వ ఉండదన్నారు. వార్డుల్లో కొన్నిచోట్ల కరెంటు స్తంభాలు పాతవి ఉన్నాయని వెంటనే వాటిని తొలగించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి





రేపే 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ

శ్రీ షిర్డీ సాయి విద్యానికేతన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు

రాజమహేంద్రవరం,జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పండుగ వచ్చేసింది.. మహిళలకు ఆనందం తెచ్చేసింది.. ప్రతి ఏటా సంక్రాంతికి ముత్యాల ముగ్గుల పోటీ నిర్వహించడాన్ని ఆంధ్రజ్యోతి ఓ సంప్రదాయంగా కొనసాగిస్తోంది. ఈ ఏడాది కూడా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు ముస్తాబవుతోంది. రాజమహేంద్రవరం ఆల్ బ్యాంక్ కాలనీలో ఉన్న శ్రీ షిర్డీ సాయి విద్యానికేతన్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభిస్తారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఒక గంట ముందే ప్రాంగణానికి చేరుకోవాలి.విజేతలకు అదే రోజు బహుమతులు అందజేస్తారు. మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు,మూడో బహుమతి రూ.3 వేల నగదు అందజేస్తారు. మరో పది మందికి కన్సోలేషన్ బహుమతులు ఇస్తారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఏదో ఒక గిఫ్ట్ ఇవ్వనున్నారు. పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు, వగైరా సామగ్రి ఎవరికి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే పెట్టాలి. జడ్జిలు అడిగినప్పుడు ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు అని చెప్పగలగాలి. ముగ్గువేయడానికి గరిష్ఠ సమయం 2గంటలు ఉంటుంది. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో భవానీ చారి టబుల్ ట్రస్టు తరఫున ఏర్పాట్లు చేస్తున్నారు.


పట్టుకున్న సారా ప్యాకెట్లతో ఎమ్మెల్యే వాసు

సారా విక్రయించేవారిని.. నేనే పట్టుకోవాలా?

- సారా కేంద్రంపై ఎమ్మెల్యే దాడి
- ఎక్సయిజ్ సిబ్బందిపై ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ,జనవరి 2 (ఆంధ్రజ్యోతి) :నగరంలో సారా విక్రయాలు జరుగుతుంటే ఎక్సయిజ్ సిబ్బంది ఏం చేస్తున్నారని..సారా తాగేవారిని, విక్రయించే వారిని తానే పట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మండిపడ్డారు. రాజమహేంద్రవరం 46వ డివిజన్ పరిధి రామదాసుపేటలో గురువారం ఆయన పర్యటించారు. దీనిలో భాగంగా స్థానిక మహిళలు ఆయన దృష్టికి సారా విక్రయాలను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే సారా విక్రయిస్తున్న ప్రాంతానికి వెళ్లారు.అక్కడ సారా తాగుతున్న ఐదుగురు పారిపోతుండగా ఎమ్మెల్యే ప్రొటోకాల్ నిమిత్తం వచ్చిన పోలీసులు పట్టుకున్నారు.అక్కడ సారా విక్రయిస్తున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమహేంద్రవరం లో గంజాయి,సారా, బ్లేడు బ్యాచ్‌లను నిర్మూలించుకుంటూవెళుతుంటే యథేచ్ఛగా సారా అమ్మడానికి ఎంత ధైర్యం అని మండిపడ్డారు.రాజమహేంద్రవరంలో తాను మీ భద్రత మా బాధ్యత కార్యక్రమాలు 18 నిర్వహించానన్నారు. తనిఖీ చేసిన ప్రాంతంలో ఖాళీ సారా కవర్లు చూసి ఎమ్మెల్యే ఆశ్చర్యపోయారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

రేపటి నుంచి అమలు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 15 జూనియర్ కళాశాలల విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 5425 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారని తెలిపారు.ఈ పథకాన్ని ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. 12 కళాశాలలను సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులకు అనుసంధానం చేశామన్నారు.ఈ మేరకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సుబ్రహ్మణ్యం, డీఈవో కె.వాసుదేవరావులకు నిర్వహణపై పలు సూచనలు ఇచ్చామన్నారు.

ఆస్తి తగాదా.. చిన్నాన్న, చిన్నమ్మపై దాడి 8



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఒకపక్క సంక్షేమం.. మరో పక్క అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గురువారం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చుతూ కేబినెట్‌లో అన్నదాత సుఖీభవ, మత్స్యకారులకు వేట నిషేధం పరిహారం పెంపు ఆదేశాలు జారీ చేసింది.గత వైసీపీ ప్రభుత్వం అరకొరగా ఇచ్చిన ఆర్థిక లబ్ధిని దాదాపు రెట్టింపుచేస్తూ నిర్ణయాలు తీసుకుంది.తద్వారా అన్నదాతలు, మత్స్యకారుల్లో ఆనందం నింపింది. అదే సమయంలో ఐదేళ్ల పాటు పెట్టుబడుల ఊసే లేకుండా అభివృద్ధిలో వెనుకబడిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను పారిశ్రామికంగా పరుగులు తీసేలా కీలక ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. గ్రీన్‌అమ్మోనియా, ఎలక్ట్రొలైజర్ ఉత్పత్తి యూనిట్ల ద్వారా ఏర్పాటు చేయనున్న కంపెనీలు పలు దశల్లో పెట్టనున్న రూ.16 వేల కోట్ల పెట్టుబడులకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. పిఠాపురం ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి 19 పోస్టులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

అన్నదాతా సుఖీభవ..

అన్నదాతలకు కేంద్రసాయంతో కలిపి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తున్నట్టు ప్రకటించింది. సూపర్‌సిక్స్ హామీ నేపథ్యంలో ఇచ్చిన మాట నెరవేరుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 4.54 లక్షల మంది అన్నదాతలకు రూ.908 కోట్ల వరకు లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది రైతులకు రూ.370 కోట్లు దక్కనుంది. తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.65 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు ఎకరాకు కేవలం రూ.13,500 వేలు మాత్రమే అందేది. మరో పక్క పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి 19 కొత్త పోస్టులను మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.



ఆనందం రెట్టింపు...

సుదీర్ఘ సముద్రతీరం ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలల్లో మత్స్యకారులు ఉన్నారు. వీరందరికి సముద్రంలో చేపలవేటే జీవనాధారం. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ మధ్య దాదాపు 61 రోజుల పాటు వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అసలు ఉపాధి ఉండదు. దీంతో ప్రభుత్వాలు వేట నిషేధ సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో మత్స్యకార భరోసా కింద వేట నిషేధ పరిహారం మత్స్యకారులకు రూ.10 వేలు చెల్లించేది. కూటమి ప్రభుత్వం రాగానే మత్స్యకారులకు అందించే పరిహారం పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేట నిషేధ పరిహారాన్ని ఏకంగా రూ.20 వేలు చేస్తున్నట్టు ప్రకటించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పరిహారాన్ని రెట్టింపు చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 32,434 మంది మత్స్యకారులకు రూ.64.86 కోట్ల లబ్ధి జరగనుంది. కాకినాడ జిల్లాలో 21,129 మంది, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 11,305 మంది మత్స్యకారులకు పరిహారం అందనుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమకానున్నాయి. దీంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి వరాల హారం.. ఆనంద తీరం

- రాష్ట్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు
- మత్స్యకారుల పరిహారం రెట్టింపు
- రూ.20 వేలకు పెంచుతూ నిర్ణయం
- 32,434 మందికి లబ్ధి
- అన్నదాత సుఖీభవ రూ.20 వేలు
- జిల్లాలో 4.54 లక్షల మంది రైతులు
- కాకినాడకు రెండు పరిశ్రమలు
- రూ.16 వేల కోట్ల పెట్టుబడులు

అమ్మోనియా హబ్‌గా కాకినాడ..

వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడకు ఒక్కటంటే ఒక్క పరిశ్రమా రాలేదు. పైగా ఉన్న పరిశ్రమలను బెదిరించి ఏకంగా రాయించేసుకున్నారు. దీనికి కాకినాడ సీపోర్ట్‌లో వాటాల మార్పే నిదర్శనం. అయితే వైసీపీ మిగిల్చిన విధ్వంసం నుంచి బయటపడి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పరిశ్రమలను ఆహ్వానిస్తూ కంపెనీలకు పెద్దపీట వేస్తోంది. కాకినాడలో ఏర్పాటవుతున్న గ్రీన్ అమ్మోనియా, ఎలక్ట్రొలైజర్ కంపెనీలకు భారీగా అండగా నిలబడి ప్రోత్సాహకాలు ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌కో కంపెనీ కాకినాడలో రూ.13 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. కంపెనీని ప్రోత్సహించి భారీగా ఉద్యోగ, ఉపాధి కల్పన జరిగేలా కోట్లలో స్టాంప్ డ్యూటీ మినహాయింపునిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఒకరకంగా ఈ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభిస్తే కాకినాడ రూపురేఖలు మారడంతోపాటు రాష్ట్ర ఖజానాకు భారీగా పన్నుల ఆదాయం సమకూరనుంది. చలమలశెట్టి సునీల్ సోదరుడికి చెందిన గ్రీన్ కో కంపెనీ ఏఎం గ్రీన్‌గా ఏర్పడి 2023లో కాకినాడలో పేరొందిన నాగార్జున ఫెర్టిలైజర్ కర్మాగారాన్ని రూ.1,700 కోట్లకు స్టాక్ ఎక్స్ఛేంజీ ద్వారా కొనుగోలు చేసింది. ఇప్పుడు దీనినే సాంకేతికంగా అభివృద్ధి చేసి గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయబోతోంది. 2026 జూన్‌లోపు ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి ఒక మిలియన్ టన్ను సామర్థ్యంతో కూడిన గ్రీన్ అమ్మోనియాను కంపెనీ ఉత్పత్తి చేయనుందని అంచనా వేస్తున్నారు.

నీటి నుంచి ఆ రెండూ..

కాకినాడలో రూ.2,800 కోట్లతో ఎలక్ట్రొలైజర్ల తయారీ ప్లాంట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. హైడ్రోజన్ ఇంధనం తయారీలో కాకినాడ దేశంలోనే కీలకంగా మారనుంది. ఈ ప్లాంట్‌ను సైతం గ్రీన్‌కో కంపెనీ ఏర్పాటు చేయబోతోంది. ఈ ప్లాంట్ ద్వారా ఏటా 2 గిగా వాట్‌ల ఉత్పత్తి చేయనున్నారు. ఈ కంపెనీ నీటిలో ఎలక్ట్రొలైజర్ యంత్రాలను ప్రవేశపెట్టి నీటి నుంచి హైడ్రోజన్, ఆక్సిజన్‌ను వేరుచేస్తుంది. ఇందులో హైడ్రోజన్‌ను కాకినాడలో ఏర్పాటుచేయనున్న గ్రీన్ అమ్మోనియం ప్లాంట్‌కు ఇంధనంగా వినియోగించనుంది. హైడ్రోజన్‌లో నైట్రోజన్‌ను కలిపి గ్రీన్ అమ్మోనియం తయారుచేయనుంది. నీటి నుంచి వేరుచేసిన ఆక్సిజన్‌ను సైతం విక్రయించనుంది.




మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ధవళేశ్వరంలో కలెక్టరేట్?

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటి వరకూ 15 లక్షల మెట్రిక్ టన్నుల ఉచిత ఇసుక సరఫరా చేశాం. రాష్ట్ర అవసరాలకు ఇక్కడ నుంచి 65 శాతం అందించామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో గురువారం జేసీ ఎస్.చిన్నరాముడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు.ప్రస్తుతం కేటాయింపులు ముగియడంతో బోట్స్‌మన్ సొసైటీలన్నీ ఆగిపోయాయని తెలిపారు.ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని సెమీ మెకానిజం విధానంలో 52.82 లక్షల టన్నుల ఇసుకతీత లక్ష్యంగా నిర్ణయం తీసుకోనున్నామన్నారు. డ్రెడ్జింగ్ కాంట్రాక్టు ముగియడంతో మళ్లీ కొత్త ఏజెన్సీకి డ్రెడ్జింగ్ ఇచ్చే విషయమై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రహదారుల్లో గుంతలు పూడ్చే కార్యక్రమం కింద జిల్లాలో 531 కిలోమీటర్లు లక్ష్యంకాగా ఇప్పటి వరకూ 187 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చినట్టు చెప్పారు. ఉపాధి హామీ నిధులతో పల్లె పండుగ కింద సీసీ రోడ్లు, డ్రైన్లకు జిల్లాలో రూ.142 కోట్లు మంజూరు కాగా 50 శాతం పూర్తయ్యాయన్నారు. సం క్రాంతికి పూర్తి చేస్తామని చెప్పారు. రీ సర్వేలో భాగంగా 272 రెవెన్యూ గ్రామాలకు ఇప్పటి వరకూ 190 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన 72 గ్రామాల్లో మండలానికి ఒక గ్రామాన్ని తీసుకుని ముందుగా రీసర్వే చేస్తామన్నారు. జిల్లాలో 286 చోట్ల రెవెన్యూ సదస్సులు లక్ష్యంగా 230 గ్రామాల్లో నిర్వహించి 2903 అర్జీలు స్వీకరించామన్నారు. వాటిలో 1041 పరిష్కరించినట్టు చెప్పారు. పోలవరం -జీలుగుమిల్లి హైవే, పట్టిసీమ నుంచి కొవ్వూరు వరకూ ఏటిగట్టుపై జాతీయ రహదారికి సర్వే ఆరంభించినట్టు చెప్పారు.బొబ్బర్లంక నుంచి ధవళేశ్వరం ..వేమగిరి వరకూ గోదావరి బండ్ రహదారి నిర్మాణానికి ఎంపీ పురందేశ్వరి రూ.120 కోట్లతో ప్రతిపాదనలు చేసినట్టు తెలిపారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ఇళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. జాంపేట వద్ద పోలీసు గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ శాశ్వత భవన ప్రతిపాదన వెనక్కి తీసుకుని ధవళేశ్వరం ఇరిగేషన్ స్థలాల్లో నిర్మించే ఆలోచన చేస్తున్నామని.. వేరే ప్రాంతాల్లో భూమి పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

మేయర్‌గా పోటీ చేస్తా

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2 (అంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మేయర్‌గా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని.. ఈ సీటును వదులుకునే ప్రసక్తే లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు.మోరంపూడి గన్నిస్ శుభమస్తు ఫంక్షన్ హాలులో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆర్‌టీసీ విజయనగరం జోనల్ చైర్మన్‌గా పనిచేసిన నాటి నుంచి గుడా చైర్మన్ వరకు పార్టీకి నిస్వార్థంగా సేవలందించానని చెప్పారు. గతంలో తనను ఎంపీగా పోటీ చేయమని అధినేత చంద్రబాబే నేరుగా అడిగినప్పటికి పోటీ చేయకుండా ఆ అవకాశం చంద్రు శ్రీహరికి ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. మేయర్‌గా తన కుమార్తెను పోటీ చేయించమని అడిగినా వదులుకున్నామన్నారు. పార్టీ కోసం అహర్నిశలు పాటుపడ్డానని ఈ విషయం చంద్రబాబుకు తెలుసన్నారు. ఇప్పుడు ఒక్కసారైన ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నానని..తనను అందరు ఆదరిస్తారని చెప్పారు. పుష్కరాల ముందే ఎన్నికలు జరుగుతాయన్నారు. అది గ్రామాల విలీనంతోనా.. పాత 50 డివిజన్లతోనా అనేది తమ నాయకుడు చంద్రబాబు నిర్ణయమే ఫైనల్ అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేసి వేధించిన వారిని చంద్రబాబు పట్టించుకోకుండా వదిలివేయడం పట్ల పార్టీ శ్రేణుల్లో నిరాశ ఉందన్నారు. ఇక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కొంత మంది పోలీసులు తీరు మారలేదన్నారు. దీనిపై హోంమంత్రి స్పందించి సరిచేయాలన్నారు.

నేడు గోపాలపురంలో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గోపాలపురం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి సంస్థ అధికారి హరీష్‌చంద్ర ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పెరుమాళ్ల రావు తెలిపారు. మూడు ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయన్నారు.బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. జిల్లాలో నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పోలీస్ ఔట్‌పోస్ట్‌లో కలప


నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్‌లోని పోలీస్ ఔట్‌పోస్ట్‌లో కలపను భద్రపరచిన దృశ్యం

నిడదవోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ట్రాఫిక్‌ను నియంత్రించే పోలీసులకు ఎండ, వాన నుంచి రక్షణ కల్పించేందుకు ఎందరో దాతలు పోలీస్ శాఖకు ఔట్ పోస్టులను అందిస్తుంటారు. ఈ పోలీస్ ఔట్‌పోస్టులను పట్టణ ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్ల వద్ద ఏర్పాటు చేయడం ద్వారా పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు, శాంతిభద్రతలు పరిరక్షించే క్రమంలో వినియోగించుకుంటారు. నిడదవోలులోని అతి ముఖ్యమైన కూడలి గణేష్‌చౌక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్ట్‌లో రాబోయే సంక్రాంతికి భోగి మంటల కోసం కొందరు కలపను భద్రపరుస్తున్నారు. ఇదే సెంటర్ మీదుగా ప్రతినిత్యం పోలీస్ అధికారులు, సిబ్బంది రాకపోకలు సాగిస్తుండడంతో పాటుగా ప్రతినిత్యం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఈ సెంటర్‌లో పోలీసులు ఉంటారు. ప్రజల మాన ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించే పోలీసులు తమ శాఖకు చెందిన పోలీస్ ఔట్‌పోస్ట్‌ని పరిరక్షించుకోలేకపోవడం పోలీస్ అధికారుల సిబ్బంది పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుందంటూ పలువురు స్థానికులు నిట్టూర్పులు విడుస్తున్నారు.

అభయాన్స్ ఎత్తివేతపై నిమ్మకు నీరెత్తిన ప్రభుత్వం

కార్మికుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గ్రీష్మకుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రీష్మకుమార్

నిడదవోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికులకు మేలు చేస్తామని హామీ ఇచ్చి పాలన చేపట్టి ఆరు నెలలయినా అభయాన్స్ ఎత్తివేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. గురువారం నిడదవోలులో యూనియన్ అధ్యక్షుడు కోనేటి మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్మికుల సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో అప్పటి వైసీపీ ప్రభుత్వం కార్మికులకు సంబంధించిన అన్ని పథకాల అమలుపై అభయాన్స్ (సస్పెన్షన్) విధించిందన్నారు. కూటమి అధికారంలోకి రావడానికి అన్నిరంగాల కార్మికులు అండగా నిలిచారన్నారు. అలాంటిది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభయాన్స్‌ను ఎత్తివేసే ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో తోరం సూరిబాబు, సత్తిబాబు, నాగరాజు, నంగాలు, వెంకట్రావు, రమణ, నీరా రామయ్యలు పాల్గొన్నారు.

న్యాయవాది శేషాద్రి మృతికి నిరసన


నిడదవోలులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నిడదవోలు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం సీఐ శాంతిలాల్ న్యాయవాది శేషాద్రిని స్టేషన్‌కు పిలిచి అనుచితంగా ప్రవర్తించడంతో తీవ్ర మనస్తాపానికి గురై న్యాయవాది శేషాద్రి అక్కడికక్కడే మృతి చెందాడని సీఐ తీరుకు నిరసనగా నేడు న్యాయవాదులంతా నిరసన వ్యక్తం చేస్తున్నామని బార్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. గురువారం నిడదవోలులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బయట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మృతి చెందిన న్యాయవాది శేషాద్రి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల పాటు విధులను బహిష్కరించి నిరసన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ములగాల రవికుమార్, మత్తి అర్జునుడు, కంఠంశెట్టి సత్యనారాయమూర్తి, సతీష్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధర ఇస్తానని మోసాలు

కొవ్వూరుకు చెందిన ఒకరి అరెస్టు

చాగల్లు, జనవరి 2, (ఆంధ్రజ్యోతి): అధిక ధర ఇస్తామని నమ్మించి ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా మోసగించిన కొవ్వూరుకు చెందిన దుద్దుపూడి సూరిబాబును పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఐ కె.నరేంద్ర వివరాల ప్రకారం.. సూరిబాబు మండలంలోని దారవరం గ్రామానికి చెందిన గారపాటి సత్తిబాబు నుంచి నాలుగు లారీ లోడుల ధాన్యాన్ని తీసుకువెళ్లి డబ్బులు ఇవ్వకుండా మోసగించి పరారీలో ఉన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సూరిబాబును గురువారం అరెస్టు చేసి నిడదవోలు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు తెలిపారు. కాగా సూరిబాబుపై కొవ్వూరు రూరల్, టౌన్ స్టేషన్లు, సీతానగరం, గోకవరం, జంగారెడ్డిగూడెం, ఐ.పోలవరం, పెడన, వీరఘట్టం తదితర పోలీసు స్టేషన్లలోనే కాకుండా ఒడిస్సాలో కూడా కేసులు నమోదయినట్టు ఎస్ఐ నరేంద్ర చెప్పారు. ఇతను ధాన్యం, మొక్కజొన్న, మైదా, నూకలకు అధికరేటు ఇస్తానని రైతులను, మధ్యవర్తులను నమ్మించి వారి వద్ద నుంచి లోడ్లు తీసుకెళ్లి అమ్ముకుని డబ్బులు ఇవ్వకుండా పరారవుతున్నాడని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


వీరభద్రరావును సత్కరిస్తున్న దృశ్యం

నల్లజర్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపల్లి హైస్కూల్ 1979-80 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం పూర్వ విద్యార్థి తాళ్లూరి సత్యనారాయణ ఇంటి వద్ద కలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయురాలు ఆలపాటి పద్మవాణి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. 44 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు రోజంతా ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా.. అమెరికాలో సాఫ్ట్‌వేర్ సంస్థలు నిర్వహిస్తూ పలువురికి ఉద్యోగాలు కల్పించిన సహచరుడు చెన్నా వీరభద్రరావును సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రావూరి శ్రీనివాస్, మామిడాల నాగేశ్వరరావు, ఎలిగంటి వెంకటేశ్వరరావు, పెద్దిరాజు, శ్రీరామమూర్తి, కవిలి సత్యనారాయణ, కోట జగన్, రామకృష్ణ సత్యమోహన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నాన్నపై కత్తితో దాడి

» నందమూరులో ఆస్తి తగాదాల నేపథ్యంలో ఘటన
» భార్యాభర్తలకు తీవ్రగాయాలు
» తండ్రీకొడుకులపై హత్యాయత్నం కేసు


గాయాల పాలైన లక్ష్మణరావు, కృష్ణవేణి

కొవ్వూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాల నేపథ్యంలో పినతండ్రిపై కత్తితో దాడి చేసిన సంఘటన కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గన్నమని లక్ష్మణరావుకు అతని అన్నయ్య వెంకట రామారావుకు కొంతకాలంగా భూతగాదాలు ఉన్నాయి. పది రోజులుగా రామారావు, అతని కుమారుడు నరేష్‌చౌదరి.. లక్ష్మణరావు నడిచే స్థలాన్ని వ్యవసాయ వస్తువులతో మూసివేశారు. వ్యవసాయ మోటారు పైపులు, వైర్లను కట్‌చేశారు. ఏమిటని లక్ష్మణరావు ప్రశ్నించడంతో భూమి సరిహద్దు విషయమై వివాదానికి దిగారు. గురువారం మధ్యాహ్నం లక్ష్మణరావు సోమాలమ్మ గుడి వద్ద పంట పొలం దున్నుతుండగా నరేష్‌చౌదరి అక్కడికి వెళ్లి రామారావు సూచనలతో కొడవలితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. అడ్డువచ్చిన లక్ష్మణరావు భార్య కృష్ణవేణి చేతిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వాళ్లు రావడంతో తండ్రీకొడుకులు పరారయ్యారు. గాయాలపాలైన లక్ష్మణరావు, కృష్ణవేణిలను రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు రూరల్ సీఐ కె.విజయబాబు, ఎస్ఐ కె.శ్రీహరిరావు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నరేష్‌చౌదరి, రామారావు పదేళ్ల కిందట భూ తగాదాల నేపథ్యంలో లక్ష్మణరావుపై ఇదే విధంగా దాడి చేశారని, ఈ కేసులో నరేష్‌చౌదరి జైలుకు వెళ్లారని పోలీసులు తెలిపారు. మరలా పదిరోజులుగా గొడవలు పడుతున్నారని, పెద్దల్లో రాజీ ప్రయత్నాలు జరుగుతుండగా రామారావు నరేష్‌చౌదరి కొడవలితో దాడిచేశాడని పోలీసులు చెబుతున్నారు. లక్ష్మణరావు ఫిర్యాదుపై తండ్రీకొడుకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేములూరులో రెవెన్యూ సదస్సు

కొవ్వూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములూరులో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ముందుగా గ్రామ వీధుల్లో రెవెన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించి రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశ్యాన్ని ప్రజలకు వివరించారు. భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ అన్నారు. ప్రజలు, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

48 గంటల్లో పరిహారం అందాలి

» అట్రాసిటీ చట్టంతో అట్టడుగు వర్గాలపై వివక్ష, దౌర్జన్యాలు తొలగిపోవాలి : కలెక్టర్ ప్రశాంతి
» పౌరహక్కులపై ప్రతినెలా సమావేశం నిర్వహించాలి : ఎస్పీ కిషోర్
» జిల్లా స్థాయి మోనటరింగ్ కమిటీ త్రైమాసిక సమావేశం


జిల్లా మోనటరింగ్ కమిటీ త్రైమాసిక సమావేశ దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంబంధిత ఉత్తర్వులు జారీ చేసిన వాటికి 48గంటల్లో పరిహారం అందజేయాల్సి ఉంటుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఎస్సీఎస్టీ అత్యాచారాల నిరోధకచట్టం 4వ త్రైమాసిక జిల్లా స్థాయి మోనటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎంఎస్ శోభారాణి, కమిటీ సభ్యులు తాటికొండ బాబు, ఆదిగోలను చిన్నరాజు, రావర్ల జాన్, పలు శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరహక్కుల పరిరక్షణ చట్టం, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అత్యాచారాల నిరోధక చట్టం, అట్టడుగు వర్గాలపై వివక్ష, దౌర్జన్యాలను తొలగించే లక్ష్యంతో పర్యవేక్షణ, చట్టాలు అమలు ఉండాలన్నారు. 2016 వెలుగులో సవరించిన నిబంధనలను రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆ మేరకు త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీని ప్రకారం అట్రాసిటీ బాధితులకు ఉపశమనం మొత్తం రూ.85,000 మేరకు పరిహారం అందజేయాలన్నారు. ఎస్పీ నరసింహకిషోర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, పరిష్కారం కోసం ఖచ్చితంగా ప్రతినెల చివరి శనివారం మండల స్థాయి పౌరహక్కులపై సమావేశం నిర్వహించాలన్నారు. వాటికి సంబంధించి ముందస్తుగా తహశీల్దార్ షెడ్యూల్ నిర్ణయించి వాటిని స్టేషను హౌస్ అధికారికి అందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమగ్ర వివరాలు రూపొందించుకోవాలన్నారు. గత ఐదారు నెలల కాలంలో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు తగ్గాయని వివరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణిసుస్మిత, డీఎస్పీలు, ఇన్‌ఛార్జ్ డీపీవో ఎం.నాగలత, ఐసీడీఎస్ అధికారి కె.విజయకుమారి, సంక్షేమ శాఖ అధికారులు కేఎన్ జ్యోతి, బి.శశాంక, వై.శ్రీనివాస్, ఎస్‌వీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే ముప్పిడి


శాశ్వత సభ్యత్వం తీసుకున్న నాయకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పేదల వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో పంగిడి గ్రామానికి చెందిన పెన్నాడ పవన్‌సాయికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3,86,003 చెక్కును పంపిణీ చేశారు. అలాగే పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు), ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ పార్టీ శాశ్వత సభ్యత్వా(రూ.1 లక్ష)లను నమోదు చేసుకున్నారు. అంతకుముందు కొవ్వూరుకు చెందిన సూర్యదేవర రంజిత్, అన్నదేవరపేటకు చెందిన గోరిజాల వెంకటప్రసాద్ శాశ్వత సభ్యత్వాలు నమోదు చేసుకున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఇదిలా ఉండగా కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అత్తయ్య రూతమ్మ అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. గురువారం ఉదయం కొవ్వూరులో అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతోపాటు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కౌన్సిలర్లు రుత్తల భాస్కరరావు, బత్తి నాగరాజు తదితరులు రూతమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రత్నకుమారి, రాజేష్‌లకు సంతాపం తెలియజేశారు. కార్యక్రమాల్లో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, వట్టికూటి వెంకటేశ్వరరావు, పొట్రు సిద్దూ, పి.శ్రీనివాస్, కె.విజయకుమార్, యనమదల శివరామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలిస్తే అద్భుత ఫలితాలు

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
వేళ్లచింతలగూడెంలో క్రికెట్ పోటీలు


పోటీలు ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రతిభ ఉన్న యువతకు ప్రోత్సాహకాలు అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామంలో సంక్రాంతి సంబరాల కమిటీ నేతృత్వంలో ఆర్అండ్ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే మద్దిపాటి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాలాలంతోపాటు పరుగులు తీస్తున్న యువత వృత్తికి అంకితమై శారీరక శ్రమను కోల్పోవడంతో జీవన విధానం మారిపోయిందన్నారు. అటువంటి వారికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడంతోపాటు శారీరక రుగ్మతలను తొలగిస్తుందన్నారు. ఈ క్రికెట్ పోటీల్లో 16 జట్లు పాల్గొంటున్నాయని, విజేతలకు మొదటి బహుమతిగా రూ.1.50 లక్షలు, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి రూ.30,000 అందించనున్నట్టు తెలిపారు. అనంతరం ఆయన కొద్దిసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు కొర్లపాటి రాము, పిన్నమనేని చినబాబు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ కాకులపాటి లలిత, సర్పంచ్ గోళ్ళ దండియ్య, సీఐ నాగేశ్వర్ నాయక్, ఎస్ఐ కె.సతీష్‌కుమార్, రొంగలి సత్యనారాయణ, వడ్లమూడి రమేష్, ఇల్లూరి రాంబాబు, పరిమి జగదీష్, కాట్రగడ్డ సురేష్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

» ఉండ్రాజవరం ఎంఈవో సక్సేనరాజు
» పలు ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో నెహ్రూరాజీ

ఉండ్రాజవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీలు కృషి చేయాలని ఎంఈవో సక్సేనరాజు అన్నారు. గురువారం ఉండ్రాజవరంలో పాఠశాలలో మండలంలోని పలు పాఠశాలల యాజమాన్య కమిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెరిగేటట్టు కృషి చేయాలని, ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో డి.శారదా జ్యోత్స్న, రిసోర్స్‌పర్సన్స్ పి.ఆంజనేయులు, పీఎస్ వీ సత్యనారాయణ, ఎం.తిరుపతిరావు, కె.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పాఠశాల యాజమాన్య కమిటీలకు వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్టు ఎంఈవో సీహెచ్ బాలామణి తెలిపారు. కార్యక్రమంలో కమిటీలు పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, సామాజిక తనిఖీ, కమిటీ బాధ్యతలు, పర్యావరణ పరిరక్షణ, మధ్యాహ్న భోజన పథకం, ప్రజల భాగస్వామ్యం, సమకాలీన సమస్యల పరిష్కారం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారని, రిసోర్స్‌పర్సన్స్‌గా జి.సతీష్, జె.పాపారావు, డి.రాము వ్యవహరించారని ఎంఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నెహ్రూరాజీ, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు సీహెచ్ సుబ్బలక్ష్మి, కె.వాసవి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్ఎంసీ సభ్యులు పాఠశాల అభివృద్ధిలో సమర్థవంతంగా వ్యవహరించాలన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థుల సమస్యలు, పరిష్కారాలపై వివరించారు. పలు అంశాలపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఏఎంవో డి.గౌరీశంకరరావు సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యులకు పలు సూచనలు చేశారు.

రేపు 'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్

» ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక
» రామ్‌చరణ్, సినిమా టీమ్ హాజరు
» లక్ష మంది వస్తారని అంచనా
» వేమగిరి సమీపంలో ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం/కడియం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి సమీపంలోని జాతీయ రహదారి (గతంలో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహించిన) స్థలంలో ప్రముఖ నటుడు రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను శనివారం నిర్వహించనున్నారు. ఇందుకు గాను భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు లక్ష మంది అభిమానులు హాజరుకావొచ్చని చిరంజీవి అభిమాన సంఘం నాయకుల కథనం. శనివారం సాయంత్రం ఆరు నుంచి 9.30 గంటల వరకు ఈవెంట్ నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హాజరు కానున్నారు. ఆ రోజు సాయంత్రం మధురపూడి విమానాశ్రయానికి వచ్చి అక్కడి నుంచి కారులో షెల్టన్ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఈవెంట్ స్థలానికి వెళ్తారు. ఈ మేరకు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పోలీసు అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యే సభాస్థలిని పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపు, భద్రత తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమానికి రామ్‌చరణ్‌తో పాటు నటులు కైరా అద్వానీ, అంజలి, ఎస్‌జే సూర్య, దర్శకుడు శంకర్, దిల్ రాజు, సంగీత దర్శకుడు తమన్ హాజరు కానున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన చిరంజీవి అభిమాన సంఘ నేతలు తాడితోటలో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఏపీ ప్రాంతాల నుంచి ఎంత మంది వస్తారో అంచనా వేశారు. ఈవెంట్‌ను సక్సెస్ చేయాలని అఖిల భారత చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు గెడ్డం శివ, రామ్‌చరణ్ అభిమాన యువశక్తి నేత శివ చెర్రీ, మెగా అభిమానుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు.


ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగే గ్రౌండ్

భూముల రీసర్వే ప్రాజెక్టునకు

సత్యవాడ ఎంపిక

ఉండ్రాజవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే కార్యక్రమం పైలట్ ప్రాజెక్టు సత్యవాడ గ్రామంలో నిర్వహిస్తామని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సత్యవాడలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఈనెల 18 వరకు ఫీల్డ్ లెవిల్ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూములు ఈనెల 21నుంచి 30వరకు, ప్రయివేటు భూముల రీసర్వే ఫిబ్రవరి 2నుంచి 27వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు జి.శ్రీనివాసరావు, రీసర్వే డీటీ ఎం.హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఉండ్రాజవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈ నెల 3న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ ఎస్.అప్పారావు గురువారం తెలిపారు. పాలంగి, కె.సావరం, చివటం గ్రామాలకు 8గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

చాగల్లు: మండలంలోని చిక్కాల సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 3, 4 తేదీల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చిక్కాల, చిక్కాలపాలెం, కలవలపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్ఎస్ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు.

హైదరాబాదు వెళ్లి

పింఛను అందజేత

గోపాలపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చిట్యాల గ్రామానికి చెందిన పింఛన్‌దారు అంద్రూ లక్ష్మి హైదరాబాదు ఆసుపత్రిలో మోకాళ్ల మార్పిడి సర్జరీ చేయించుకున్నారు. మూడు నెలలుగా ఆమె అందుబాటులో లేకపోవడంతో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ హైదరాబాదు వెళ్లి 3 నెలల పింఛన్‌ను లక్ష్మికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు, గద్దే హరిబాబుకి, నూతంగి దొరబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఎన్‌జీవో-2025

క్యాలెండర్ ఆవిష్కరణ

గోపాలపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్‌జీవో-2025 క్యాలెండర్‌ను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అజయ్‌బాబు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు హరీష్, తారక్,పాపారావు, కార్యదర్శి ఆశావల్లి, రమాదేవి,సువర్చల, లక్ష్మి పాల్గొన్నారు.

చెరువులో చెత్త శుభ్రం చేసుకున్న

కవులూరు గ్రామస్తులు

నల్లజర్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కవులూరు పంచాయతీ చెరువు గట్టుపై కొంతమంది చెత్త వేయడం ద్వారా చుట్టు పక్కల నివసించే ప్రజలకు దోమల ఉధృతి పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై మూడు నెలల నుంచి పంచాయతీ కార్యదర్శికి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో గురువారం గ్రామస్థులే శుభ్రం చేసుకున్నారు. చెత్త సేకరణలో పంచాయతీ తీవ్ర విఫలం చెందినదని గ్రామస్థులు బేతిన రాంబాబు,బేతపూడి రామచంద్రం, గగ్గర రాము తదితరులు వాపోతున్నారు.

హత్యాయత్నం కేసులో

ముగ్గురు యువకుల అరెస్టు

కొవ్వూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బీరు బాటిల్‌తో దాడిచేసి వ్యక్తిని చంపడానికి యత్నించిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. దొమ్మేరు సావరంలో డిసెంబరు 31వ తేదీ రాత్రి తొర్లపూడి విజయశేఖర్, ఈడూరి ప్రశాంత్, ఈడూరి ప్రకాష్ టపాసులు కాల్చుతుండగా బొంతా రాజు ప్రశ్నించాడు. దీంతో జనవరి 1న రాజును గ్రామంలోని అరటితోట వద్ద ముగ్గురు కలిసి బీరు బాటిల్‌తో కొట్టి దాడిచేసి చంపడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో చేతులకు గాయాలయ్యాయి. అలాగే కొవ్వూరు అభ్యాస పాఠశాల స్కూల్ బస్సును దొమ్మేరు సావరంలలో తోర్లపూడి విజయశేఖర్, ఈడూరి ప్రకాష్ అడ్డగించి రాళ్లతో కొట్టి, డ్రైవర్ ఉప్పులూరి దుర్గాప్రసాద్‌పై దాడిచేసి చేతులతో కొట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్మోహనరావు కేసునమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో ముగ్గురిని అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	: ముఫాస
వై.స్క్రీన్2 : క్రావెన్ ధ హంటర్, మార్కో	
దేవిశ్రీ (గాయత్రి	:
అనన్య	: పుష్ప-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	: పుష్ప-2
రాధాకృష్ణ	: ముఫాస
శ్రీగణపతి	: మార్కో
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: పుష్ప-2
త్రినాథ్ సినీ మ్యాక్స్	: పుష్ప-2